

● అరవింద వారధిపై చేరిన చెత్తను ఎత్తిపోస్తున్న ఎక్స్‌కవేటర్

నష్టం.. కష్టం

వర్షాలు, వరదలతో బీభత్సం

నీటిలో నానుతున్న పంట పొలాలు



రేపల్లె : పల్లెపాలెంలో బురదమయమైన ఇంట్లో వస్తువులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు

వరుణుడు విరామం తీసుకున్నాడు. కృష్ణమ్మ కరుణించింది. వర్షాలు, వరదల బీభత్సం బుధవారం నుంచి బయటపడుతుంది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతం గ్రామాలు, లంకల్లో ఎవరిని కదిపినా కన్నీటి సంద్రమే. పంటలు కోల్పోయి కొందరు.. వ్యవసాయసామగ్రి గల్లంతై మరికొందరు.. మూగజీవాలు కనిపించక పలువురు.. ఇళ్లకు నష్టం వాటిల్లి కొందరు.. ఇలా ఎక్కడ చూసినా వరద బీభత్స బాధితులు కనిపిస్తున్నారు. ఎటు చూసినా నీరు.. కళ్లల్లో కన్నీటి వరద.. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన స్థితి పలువురిది. కృష్ణమ్మ మహోగ్రంతో గొడ్డు, గోద, పొలం, పుట్ర ఏదీ అక్కరకు రాకుండా పోయిందని లంకలు, పరివాహక గ్రామాల్లోని ప్రజలు కన్నీటి పర్యంత మవుతున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో పంటలకు, ఆస్తులకు ఏరీతిలో.. ఎంతమేర నష్టం వాటిల్లిందో బాధితులు చూసుకుంటున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అధికారులు నష్టం అంచనాల్లో నిమగ్నమయ్యారు. పంటల నష్టం లెక్కించేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రత్యేక బృందాలను నియమించాయి. ప్రాథమిక అంచనాల్లోనే వేల ఎకరాలు ఉండటంతో వర్షాలు, వరద బీభత్స నష్టం అపారమని తెలుస్తోంది.

దిక్కుతోచని స్థితిలో రైతులు కన్నీటి పర్యంతం
లంక గ్రామాల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలు
వరద ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్లు, ట్రక్కులు, గోడలు

తెనాలి, బాపట్ల(ఆంధ్రజ్యోతి), కొల్లూరు, కొల్లిపర, సెప్టెంబరు 4: కృష్ణమ్మ ప్రకోపానికి నదీపరివాహక గ్రామాలు, లంకలు విలవిలలాడిపోయాయి. ప్రకాశం బ్యారేజి నుంచి రికార్డు స్థాయిలో నీటి ప్రవాహంతో వర్షం వరదగా మారి పొలాలను కబళించింది. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల పరిధిలో ఉద్యాన పంటలతో పాటు వరి కూడా పూర్తిగా నీట మునిగింది. బ్యారేజీకి ఎగువున భారీ వర్షాలు, కృష్ణానదికి వరదతో పల్నాడు ప్రాంతంలో కూడా చాలావరకు పంటలకు అపార నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా నీటిలోనే పంటలు నానిపోయాయి. పత్తి, కంది తదితర పంటలకు తీవ్రంగా నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. పంటలతో పాటు పలువురు ఆస్తులు కూడా నష్టపోయారు. లంక గ్రామాల్లో గృహాలు, ప్రభుత్వ ఆస్తులు దెబ్బతినగా వాణిజ్య పంటలు కూడ తుడిసి పెట్టుకుపోయాయి. కృష్ణమ్మ వరద ఉధృతికి రేకుల షెడ్లు, పూరిళ్లు కూలిపోగా ప్రహరీలు పడిపోయాయి. ట్రాక్టర్ ట్రక్కులు తిరిగబడి దెబ్బతినిపోయాయి. నిల్వ చేసిన ధాన్యం, ఇతర పంట దిగుబడులు చాలాప్రాంతాల్లో తడిసిపోయాయి. లంక గ్రామాల్లో ఉన్న ప్రజా పంపిణీ దుకాణాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ బియ్యం కూడా తడిసి పోయింది. కృష్ణమ్మ లంక గ్రామాల ప్రజల జీవితాలను తలకిందులు చేసేసింది. వరదకు ముందు పండించి ఇంటికితెచ్చి దాచుకున్న పంటనూ వదలకుండా ముంచేసింది. నిన్నటి వరకు ప్రాణాలు దక్కితే చాలన్న ఆలోచనతో ఉన్నవారికి చివరకు ఆ ప్రాణం, వంటిపై దుస్తులే మిగిలాయి. మునిగిన ఇళ్లన్నీ బుదరమయమై దుర్గంధం వెదచల్లుతుంటే, వాటిలో తలదాచుకోవడానికీ నానా తంటాలు పడాల్సిన దారుణ పరిస్థితి పలు ప్రాంతాల్లో నెలకొంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సాయం తాత్కాలికంగా కడుపు నింపుతుండటంతో కాస్తంత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని కదిపినా తీర్చలేని బాధలు, పూడ్చలేని నష్టాలే. కృష్ణా నదీ పరివాహక గ్రామాల్లో వరద తగ్గుముఖం పట్టాక బుధవారం ఇళ్లన్నీ నీటి నుంచి బయటపడ్డాయి. చాలావరకు రహదారులూ కోతపడిపోయి, గండ్లతో నడవడానికి కూడా వీలులేని విధంగా మారి కనిపించాయి. నాలుగు రోజులుగా వరద నీటిలో లంక గ్రామాలన్నీ మునిగిపోయిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు ఇళ్లలో తలదాచుకోలేక, డాబాలపైకి ఎక్కినా, కరెంట్ లేక చీకటిలోనే దోమలతో నరకాన్ని అనుభవించామని బాధితులు వాపోయారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, మునగలపల్లిలంక, భట్టిప్రోలు మండలం చింతమోటు, పెసర్లంక, పెదలంక, కృష్ణనగర్, పల్లెపాలెం వంటి గ్రామాలు ఇంకా కొంతమేర వరదలోనే ఉన్నాయి. కొల్లూరు నుంచి లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా కోతపడిపోయి గండ్లమయంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటన సమాచారంతో బుధవారం అధికారులు రోడ్లను సరిచేసే పనులు మొదలుపెట్టారు. నది మధ్యలో ఉన్న లంకలకు ఏకైక మార్గమైన అరవింద వారధిపై చెత్త, ముళ్లకంపలు పేరుకుపోయాయి. వరదకు కొట్టుకు వచ్చిన చెత్తా చెదారాలతో పాటు మూగజీవాల కళేబరాలతో అరవింద వారధి నిండిపోయింది. దోనేపూడి నుంచి పోతార్లంక వెళ్లే దారుల పరిస్థితీ దారుణంగా ఉంది. అరటి, కంద, పసుపు, కూరగాయలు, తమలపాకు, బొప్పాయి తదితర పంటలన్నీ పనికిరాకుండా పోయాయి. అరటి తదితర పంటలు దిగుబడి తీసుకునే తరుణంలో వరద కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు కన్నీటి పర్యంతమ య్యారు. కొల్లూరు, భట్టిప్రోలు, కొల్లిపర, రేపల్లె మండలాల పరిధిలో 5,200 ఇళ్ల వరకు వరద నీటిలో మునిగిపోయాయి. వీటిలో 3,900 ఇళ్ల వరకు బయటపడితే, భట్టిప్రోలు మండలంలో మిగిలిన ఇళ్లు ఇంకా నీటిలోనే ఉన్నాయి. బయటపడిన ఇళ్లలో సర్వం తడిచి, పనికిరాకుండాపోతే, వారికి బంక మట్టే మిగిలింది. గృహోపకరణాలు, విద్యుత్తు పరికరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తడిచి పనికిరాకుండా పోయాయి. మూడు రోజులుగా చీకట్లో ప్రజలు అల్లాడిపోయారు. బుధవారం వరద తగ్గగానే పనులు మొదలుపెట్టి 25 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం విద్యుత్ శాఖకు రూ.80 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.



మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో అడుగుమేర తగ్గిన వరద

నేడు లంక గ్రామాలకు చంద్రబాబు

● కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో సీఎం పర్యటన

వేమూరు: కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని వరద ప్రభావిత లంక గ్రామాల్లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన బుధవారం ఖరారైంది. దీంతో అధికారులు హుటాహుటిన ఏర్పాట్లు చేస్తున్నారు. వేమూరు మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన హెలిప్యాడ్‌కు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని గ్రామాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. బాధితులను పరామర్శించి దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి బస కోసం వేమూరులోని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు గృహాన్ని, ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని కలెక్టర్ వెంకటమురళి పరిశీలించారు. చంద్రబాబు రెండు రోజులు వేమూరులో ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రేపల్లె ప్రాంతంలో కూడా పర్యటించే ఆలోచనలో సీఎం ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు పరిశీలించారు.



రేపల్లె : బొబ్బర్లంక గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజల సమస్యలను వింటున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

మంత్రులు అనగాని, గొట్టిపాటి

అధిక వర్షాలు, వరదలకు నష్టపోయిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల్లో మంత్రులు బుధవారం పర్యటించి బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పు లే ఇప్పుడు ప్రజలకు శాపంలా మారాయన్నారు. గృహాలు కోల్పోయిన వారికి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్థికంగా ఆదుకునే దిశగా ముందుకు వెళ్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు.



భట్టిప్రోలు మండలం వెల్లటూరు లంకల్లో వరద ముంపులోనే పసుపు పైరు



వరద ఉధృతికి దెబ్బతిన్న బొప్పాయి తోట

తగ్గిన ఉధృతి..

నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటి విడుదల ఆగింది. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల 4 లక్షలు క్యూసెక్కులకు పరిమితం చేశారు. దీంతో నదిలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. మంగళవారం వరకు కృష్ణానది కరకట్టకు అనుకుని ప్రవహించిన నీరు ప్రస్తుతం నదిలో మాత్రమే ప్రవహిస్తుంది. ఎనిమిది అడుగుల మేర వరద ఉధృతి తగ్గింది. నదీ పరివాహక ప్రాంతంలో లంకగ్రామాలకు వెళ్లే రోడ్లు బయటపడ్డాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చూస్తే చాలా వరకు వరద తగ్గుముఖం పట్టడంతో పంటలు నీటిలో నుంచి బయటపడుతున్నాయి. కొన్ని చోట్ల పల్లపు ప్రాంతాల్లో మాత్రం పంటలు నీటిలో నానుతున్నాయి.





కొట్టుకుపోయిన కొల్లూరు - ఆవులవారిపాలెం రహదారి



వరద ఉధృతికి బోల్తా పడి దెబ్బతిన్న ట్రక్కులు



కొల్లిపర : బొమ్మువానిపాలెం సమీపంలో పూర్తిగా దెబ్బతిన్న మొక్కజొన్న



అన్నవరంలో వరదకుదెబ్బతిన్న దోసతోట



పల్లెపాలెంలో ఇంట్లో నీటిని బయటకు ఎత్తిపోస్తూ...



భట్టిప్రోలు : వెల్లటూరు నుంచి లంక గ్రామాలకు వెళుతున్న ప్రజలు



భట్టిప్రోలు : ఇంట్లో నీరును బయటకు ఎత్తిపోస్తూ..



ఆవులవారిపాలెంలో వరదకు తడిసిపోయిన ధాన్యం



పెదకాకాని: దెబ్బతిన్న వరి పైరు ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

బాపట్ల జిల్లాలో..

42,000 హెక్టార్లలో మునిగిన వరి

బాపట్ల(ఆంధ్రజ్యోతి): బ్యారేజీ నుంచి రికార్డు స్థాయిలో వచ్చిన వరద పొలాలను కబళించింది. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల పరిధిలో ఒక్క ఎకరం కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. వరిలో ఎకరాకు ఇప్పటికే పెట్టుబడి దాదాపు పదివేల వరకు పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయినట్లేనని రైతులు తెలిపారు. 45,000 హెక్టార్లలో పైర్లు నీటమునగగా ఇందులో వరి వాటానే 42,000 హెక్టార్లుగా ఉంది. మిగిలిన 3,000 హెక్టార్లలో మినుము, శనగ ఉంది. పంట నష్టపోయిన మండలాల్లో బాపట్లలో అత్యధికంగా 5,850, అమర్తలూరు 4,150, చుండూరు 5,000 చెరుకుపల్లి 4,200, వేమూరు 3,800 హెక్టార్లుగా అంచనా వేశారు. కర్లపాలెంలో 2520, భట్టిప్రోలులో 1,800 రేపల్లెలో 3,000 హెక్టార్లుగా అధికారులు ప్రాథమిక నివేదికలో పొందుపర్చారు. లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు 4,614 హెక్టార్లలో నష్టపోయినట్లు సమాచా రం. వరి, ఉద్యాన పంటల నష్టంతో జిల్లాలో 48,000 మంది రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరద పూర్తిగా తగ్గాక ఈ నష్టం అంచనాలు మ రింత పెరిగే అవకాశం ఉందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.



ఇంకా ముంపులోనే పెనుమూడి పల్లెపాలెం

గుంటూరు జిల్లాలో..

33,345 హెక్టార్లలో పంట నష్టం

జిల్లాలో ఏడుగురు జల సమాధి

గుంటూరు(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో 75,153 మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 35,345.2 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో వ్యవసాయ పంటలు 31,751.2, ఉద్యాన పంటలు 3594 హెక్టార్లలో ఉన్నాయి. 8,116 ఇళ్లు నీట మునిగాయి. ఏడుగురు వరదలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. వరద తగ్గుముఖం పట్టడంతో 10 క్యాంపులను మూసేశారు. ఆర్అండ్‌బీ పరిధిలో 969 కిలో మీటర్లు దెబ్బతినగా 24 చోట్ల గండ్లు పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.1,128 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.11,315 లక్షల నిధులు అవసరమౌతాయని గుర్తించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో దెబ్బతిన్న 113 రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.1,171 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.9,098.45 లక్షలు అవసరమని అంచనా వేశారు. నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 24.93 కిలోమీటర్ల రోడ్లు, డ్రెయిన్లు 6.395 కిలోమీటర్ల పొడవునా ధ్వంసమయ్యాయి. ఈ మేరకు నష్టం అంచనాలను రూపొందించి కలెక్టర్ నాగలక్ష్మి ప్రభుత్వానికి నివేదించారు.



వరదలకు పూర్తిగా దెబ్బతిన్న టమోటా తోట

పల్నాడు జిల్లాలో..

నష్టం.. రూ.56 కోట్లు

● 28,201 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు ● వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రాథమిక అంచనా ● పూర్తి స్థాయిలో లెక్కింపునకు ప్రత్యేక బృందాలు

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి): వర్షాలు.. వరదల కారణంగా జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. నీట మునగడంతో పంటలు ఆదిలోనే దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పొలాల్లో నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతున్నాయి. కాపు దశలోనే పత్తి పంట దెబ్బతినడంతో రైతులు అవేదన చెందుతున్నాయి. ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం 28,201 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. రెండు రోజుల్లో పంట నష్టం అంచనా 7 వేల ఎకరాలు పెరిగింది. ఈ లెక్కల ప్రకారం ఇప్పటికి దాదాపు రూ.56 కోట్ల వరకు పంట నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనా. పంట నష్టం పూర్తి స్థాయిలో లెక్కించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మండల, గ్రామ స్థాయిలో ఈ బృందాలు పంట నష్టం లెక్కించే ప్రక్రియను బుధవారం జిల్లా అంతటా పారంభించాయి. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 27,013 ఎకరాల్లో పత్తి, వరి, కంది తదతర పంటలకు నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలు 1,188 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉద్యాన పంటలకు భారీగానే నష్టం వాటిల్లింది. 1,187 ఎకరాల్లో అరటి, పసుపు, మిరప తదితర పంటలకు నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ తెలిపింది. పిడుగురాళ్ల, ముప్పాళ్ల మండలాల్లో పసుపు పంట దెబ్బతింది. నరసరావుపేట, గురజాల, అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.

ఆదుకుంటాం.. అండగా ఉంటాం

- ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా గృహాలు నిర్మిస్తాం
- పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది
- మంత్రులు అనగాని, గొట్టిపాటి



రేపల్లె మండలం, బొబ్బర్లంక గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజల సమస్యలు వింటున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

రేపల్లె, సెప్టెంబరు 4: వరద కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం రేపల్లె మండలం వరద ప్రభావిత ప్రాంతాలైన పెనుమూడి, రాజుకాల్వ, లంకేవానిదిబ్బ, తుమ్మల,పోటుమెరక, నల్లూరుపాలెం గ్రామాల్లో పర్యటించి బాధితులకు అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కరకట్టల మరమ్మతులు నిర్వహించని దాఖలాలు లేవన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల ఫలితాలను ఇప్పుడు ప్రజలు అనుభవించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వరద కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి నివేశన స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం ఆర్థికంగా ఆదుకునే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. సముద్రం నీరు పోటెత్తటంతో లంకేవానిదిబ్బ మత్స్యకారుల గృహాల్లోకి నీరు చేరి చాలా ఇబ్బందులకు గురయ్యారని, వాటన్నింటిని రెండు రోజుల్లో మెరుగు పరుస్తామని చెప్పారు. వేలాది ఎకరాలు నేటికీ నీటిలోనే నానిపోయి పంట కుళ్లిపోయిందని రైతులు తెలిపారన్నారు. రైతుల వద్ద నుంచే వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్ చేసి దెబ్బతిన్న పొలాలకు సంబంధించి తక్షణమే పంట నష్టం అంచనాలను రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న గ్రామాలైన పెనుమూడి పల్లెపాలెం, ఓలేరు పల్లెపాలెం,మైనేనివారిపాలెం, మోర్తోట, బొబ్బర్లంక, లంకేవానిదిబ్బ తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలను, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునే దిశగా ముందుకు వెళ్తుందన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదనీ, టీడీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రేపల్లె రామాంజనేయులు, పంతాని మురళీధరరావు, కొపనాతి రాజశేఖర్, గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకట శివరామకృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె జానకిరామయ్య, నియోజకవర్గ సమన్వకర్త మత్తి భాస్కరరావు, రేపల్లె పాపారావు, అనగాని శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఆనందబాబు



గండికి శాశ్వత పరిష్కారంపై చర్చిస్తున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే

కొల్లూరు, సెప్టెంబరు 4: కృష్ణానది వరద బీభత్సానికి సర్వస్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జిల్లా విపత్తు నిర్వహణ ప్రత్యేకాధికారి ఎంవీ శేషగిరిబాబు, కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఆనందబాబు పేర్కొన్నారు. వరద ఉధృతికి దెబ్బతిన్న లంక గ్రామాల్లో బుధవారం వారు పర్యటించారు. పెసర్లంక గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. వరద ప్రభావిత లంక గ్రామాల్లోని అన్ని గృహాలకు వెళ్లి మందులు అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వరద నీరు చేరిన గృహాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం అరవింద వారధి వద్దకు చేరుకుని మూడు రోజుల క్రితం గండి వద్ద పోసిన కట్ట తెగిపోయిన ప్రాంతాన్ని ఎమ్మెల్యేతో పాటు ప్రత్యేక అధికారి, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గండి వద్ద శాశ్వత పరిష్కారం చూడాలనీ, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గండి విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. కొల్లూరు కరకట్ట దిగువున దెబ్బతిన్న ప్రధాన రహదారికి మరమ్మతులు చేయిస్తున్నామని కలెక్టర్, ఎమ్మెల్యేలు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. గృహ సందర్శనలో బాధితులతో మాట్లాడిన కలెక్టర్ ఆహార పదార్థాల పంపిణీపై ఆరా తీశారు. లంక గ్రామాల్లో ప్రజలకు తక్షణ సహాయక చర్యలు అందిస్తామని చెప్పారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం మెరుగు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బందితో సర్వే నిర్వహించి వైద్య సేవలు అందించాలని శేషగిరిబాబు కలెక్టర్‌కు సూచించారు. లంక గ్రామాల్లో తీసుకోవాల్సిన సత్వర చర్యలపై ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు.

రేపటి వరకు కొండవీడుకోట సందర్శన నిలిపివేత

యడ్లపాడు, సెప్టెంబరు 4: చారిత్రక కొండవీడుకోట సందర్శనను ఈ నెల 6 వరకు నిలిపివేస్తున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవీడుకోట ఘాట్ రోడ్డులో పలు చోట్ల కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందేనన్నారు. విరిగిపడిన కొండచరియలను ఆర్‌అండ్‌బీ అధికారుల సహకారంతో తొలగిస్తున్నామన్నారు. వర్షం పడుతున్నందున కొండచరియలు తొలగింపు పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అంతేకాకుండ కురుస్తున్న వర్షాలకు కొండచరియలు మళ్లీ విరిగిపడే అవకాశం ఉన్నందున ఈ నెల 6వ తేదీ వరకు కొండవీడు కోట, నగరవనం సందర్శనను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకులు గమనించి సహకరించాలని కోరారు.

పీజీ అడ్మిషన్ల సీట్ల కేటాయింపు

పెదకాకాని, సెప్టెంబరు 4: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సైన్సు, ఆర్ట్స్ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల సీట్లను ఉన్నత విద్యా మండలి కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల భర్తీకి నిర్వహించిన ఏపీ పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024 ద్వారా ఈ సీట్లు భర్తీ జరిగింది. కాగా విశ్వవిద్యాలయంలో సైన్సు, ఆర్ట్స్ కోర్సులలో విద్యార్థులకు సీట్లు ఖరారు కావడంతో విద్యార్థులు వర్సిటీకి వచ్చి ఆయా విభాగాలను సందర్శించి ప్రవేశాలు పొందుతున్నారు. బుధవారం నుంచి పీజీ అడ్మిషన్లకు వచ్చే విద్యార్థుల కోలాహలం వర్సిటీలో మొదలైయింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ప్రవేశాలను చేపట్టారు. అయితే సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఆయా విభాగాల్లో చేరేందుకు పీజీ సెట్ కన్వీనర్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పీజీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మాజీరావు వర్సిటీ కళాశాలలో పీజీ సీట్ల భర్తీ సంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

విజిలెన్స్ అధికారిగా సూర్య శ్రవణ్ కుమార్

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4 : గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారిగా డి సూర్య శ్రవణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు విజిలెన్స్ ప్రాంతీయ అధికారిగా నియమించారు. గురువారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

వరద బాధితులకు రూ. 25 లక్షల విరాళం



సీఎంకు చెక్కు అందిస్తున్న ఆలపాటి, రాయపాటి, క్లబ్ పాలక వర్గ ప్రతినిధులు

గుంటూరు, సెప్టెంబరు 4: ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ పాలక వర్గ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలసి రూ. 25 లక్షల చెక్కును అందించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, చుక్కపల్లి రమేష్, పాలకవర్గ ప్రతినిధులు గౌరవ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, అధ్యక్షులు మైనేని బ్రమ్మేశ్వరారావు, ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి యాగంటి దుర్గారావు, సంయుక్త కార్యదర్శి కొండ్రగుంట శ్రీనివాసరావు, కోశాధికారి యేల్చూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు విజ్ఞాన్ వర్సిటీ చేయూత

గుంటూరు(విద్య), సెప్టెంబరు 4: విజయవాడలోని వరద బాధితులకు విజ్ఞాన్ వర్సిటీ చేయూత అందించినట్లు వీసీ ఆచార్య పి.నాగభూషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లమూడిలోని యూనివర్సిటీ నుంచి వరుగా రెండో రోజు ఆరు ప్రత్యేక బస్సుల్లో పదివేల కిచిడి ప్యాకెట్లు ,పెరుగు అన్నం, వాటర్ ప్యాకెట్లు పంపినట్లు వెల్లడించారు. కష్టసమయంలో ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం చేయాలనే స్ఫూర్తితో తాము వరద బాధితులకు అండగా నిలిచినట్లు తెలిపారు. విజయవాడలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఆహారం అందజేశామని తెలిపారు. విద్యార్థులు, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

కృష్ణమ్మకు సారె సమర్పణ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 4: గత నాలుగు రోజులుగా భారీ వరదతో ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ శాంతించాలని వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద నదికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, సారె సమర్పించారు. కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్ స్వామి, చిన్న జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రఘునాథాచార్యులు, శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, శంకర్‌రెడ్డి, వేద విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 4: జిల్లాలో నేటి నుంచి విద్యాసంస్థలు యథావిధిగా నిర్వహించాలని డీఈవో పి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాలు యథావిధిగా విద్యాసంస్థల్ని కొనసాగించాలని సూచించారు. బాధితులు ఆశ్రయం పొందుతున్న పాఠశాలలకు మాత్రం సెలవు ప్రకటించాలని హెచ్‌ఎంలకు సూచించారు. తుఫాను తరువాత పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో గదుల్ని నిశితంగా తనిఖీ చేయాలని, ఏ సమస్యలు లేని గదుల్లో మాత్రమే తరగతులు నిర్వహించాలని సూచించారు.

వరద విపత్తు.. భారీగా విరాళాలు



సీఎం చంద్రబాబుకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న చుక్కపల్లి రమేష్, రాకేష్



సీఎంకు చెక్కు అందజేస్తున్న జేసీ నాయుడు, నందకిషోర్

పయనీర్ సంస్థల ఆధ్వర్యంలో...

గుంటూరు, సెప్టెంబరు 4: వరద బాధితులను ఆదుకునేందుకు పయనీర్ సంస్థల ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్ ముందుకొచ్చారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.25 లక్షల చెక్కును అందజేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తదితరులు బుధవారం రూ. లక్ష చెక్కును కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు.

ఐఎంఏ తరపున..

గుంటూరు (మెడికల్) సెప్టెంబర్ 4: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర నాయకులు ముంపు ప్రాంత ప్రజలను ఆదుకొనేందుకు తమ వంతుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐఎంఏ వైద్యులు అందజేసిన మొదటి విడత నగదు రూ..25 లక్షలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు అందజేశారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్ర నాయుడు, కార్యదర్శి డాక్టర్ ఫణిధర్, స్టేట్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ నందకిషోర్, కోశాధికారి డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

నాగర్జున ఎడ్యుకేషనల్ సొసైటీ వితరణ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 4: నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ(ఎన్ఇఎస్) సభ్యులు తమవంతు వితరణ ప్రకటించారు. బుధవారం సొసైటీ ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎంను విజయవాడలో కలిసి రూ. 25 లక్షలు చెక్కును అందజేశారు.


గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి జేఏసీ నాయకురాలు డాక్టర్ రాయపాటి శైలజ వరద బాధితులకు రూ.5 లక్షల సాయం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం కలిసి ఆయనకు రూ.5 లక్షల చెక్కును ఆమె అందజేశారు.

రూ.10 లక్షలు విరాళం

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 4: వరద బాధితుల సహాయార్థం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. బుధవారం నరేడ్కో గుంటూరు జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రూ.10 లక్షల విరాళం చెక్కును, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య రూ.10 వేలు విరాళం అందించారు.

కలెక్టర్ పిలుపు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. దిగువ పేర్కొన్న అకౌంట్స్ ద్వారా సహాయం అందించాలన్నారు. అకౌంట్ పేరు: కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు జిల్లా అకౌంట్ నెంబర్: 33260919895, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఐడీఎఫ్‌సీ 0081061 పేరుతో చెక్కులు, డీడీలు నేరుగా పంపవచ్చని, దాతల వివరాలు ప్రకటిస్తామని తెలిపారు.



సీఎంకు చెక్కును అందజేస్తున్న శైలజ

ప్రమాదకరంగా నది రిటైనింగ్ వాల్



వరద ఉధృతికి కూలిన రిటైనింగ్ వాల్

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 4: గత నాలుగు రోజులుగా ప్రకాశం బ్యారేజి దిగువకు భారీగా వరదనీరు ప్రవహించడంతో సీతానగరం డౌన్‌లో నది వెంబడి ఉన్న రిటైనింగ్ వాల్ ప్రమాదకర స్థితికి చేరింది. నీటికి నానిపోయి ఇప్పటికే మూడు చోట్ల 10 అడుగుల మేర కూలిపోయింది. మరో రెండు చోట్ల పూర్తిగా పగుళ్లు వచ్చి కూలడానికి సిద్ధంగా ఉంది. వరదనీరు చూసేందుకు బ్యారేజి దిగువకు సందర్శకుల తాకిడి పెరిగింది. వారు ఆ వాల్‌పై కూర్చుంటూ ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఏదైనా జరగరాని ఘటనలు జరిగితే కృష్ణానది వరద ఉధృతిలో పడి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. పోలీసు సిబ్బంది అక్కడ బారికేడ్లు పెట్టి హెచ్చరికలు జారీ చేసినా సందర్శకులు పెడచెవిన పెడుతున్నారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు రిటైనింగ్ వాల్ పటిష్టతకు చర్యలు తీసుకోవాలని సీతానగరం వాసులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

మాజీ మంత్రి రోజా కళ్లున్న కబోది



కత్తెర హెన్రీ క్రిస్టినా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 4 : సీఎం చంద్రబాబు నాయుడు కార్యక్షేత్రంలో ఉండి విజయవాడలో సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతుంటే మాజీ మంత్రి రోజా నోరు పారేసుకోవటం దుర్మార్గం అని జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా అన్నారు. కూటమి ప్రభుత్వం జరుగుతున్న మంచిని చూడలేని కళ్లున్న కబోది రోజా అని ఆమె విమర్శించారు. సహాయక చర్యలపై రోజా ఇష్టానుసారంగా మాట్లాడిన నేపథ్యంలో జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా విలేకరులతో మాట్లాడారు. 74 ఏళ్ల వయస్సులో విరామం లేకుండా ప్రజలందరికీ సాయం అందాలని, విజయవాడ తిరిగి యథాస్థితికి చేరుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు సహాయ సహకారాలు అందిస్తుంటే రోజా ఎక్కడో కూర్చుని ముఖ్యమంత్రిని, డిప్యూటీ సీఎంను, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఒక వీడియో రిలీజ్ చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఒక ఆహార ప్యాకెట్ కూడా అందించలేని వైసీపీ అధ్యక్షుడు జగన్, రోజా కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం దారుణ మన్నారు. ప్రకృతి విపత్తులు అకస్మాత్తుగా సంభవిస్తాయనీ, వాటిని ఎవరు ఆపలేరు అనే విషయాన్ని రోజా తెలుసుకోవాలన్నారు. బుడమేరుకు గేట్లు లేవనే విషయం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

44,704 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 46,675 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 44,704 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,540 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15700
నెంబరు. 5	8000	13500
273	10000	12000
341	8600	14000
4884	9200	15000
సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600
బ్యాడిగి	8500	13700
దేవనూరు డీలక్స్	10000	13800
తెల్లకాయలు	4500	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15500
నెంబరు. 5	9000	12000
273	11000	11000
341	9000	16200
4884	11000	13000
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500
బ్యాడిగి	8500	12700
దేవనూరు డీలక్స్	9500	15000
తెల్లకాయలు	5500	10000

నిత్యావసరాల కిట్లను పరిశీలించిన కలెక్టర్



గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4 : నందివెలుగు రోడ్డులో ఉన్న పౌర సరఫరాల గిడ్డంగిలో వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న నిత్యావసర సరకుల కిట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పరిశీలించారు. తాడికొండ, గుంటూరు అర్బన్, గుంటూరు రూరల్, మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన 2700 కుటుంబాలకు ఈ నిత్యావసర సరకుల కిట్లను అందజేయనున్నారు. ఒక్కొక్క కిట్‌లో 25 కిలోల బియ్యం, ఒక కేజీ చొప్పున కందిపప్పు, పంచదార, పామాలిన్ ఆయిల్, బంగాళాదుంప, ఉల్లిపాయలను ఒక కిట్‌గా చేసి కుటుంబానికి పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మత్స్యకారులు, నేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందించాల్సి ఉందన్నారు. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాలకు సంబంధించి తెనాలి పౌర సరఫరాల శాఖ గిడ్డంగి నుంచి నిత్యావసర సరకులను వరద బాధితుల సహాయార్థం పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నందివెలుగు రోడ్డులోని ఎంఎస్‌ఎల్ గోడౌన్‌లో ఉన్న రైస్ నాణ్యతను, తూకాన్ని, ప్యాకింగ్ విధానాన్ని పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ, గుంటూరు తూర్పు మండల తహసీల్దార్ నగేష్ పాల్గొన్నారు.

13 న జడ్పీ స్టాడింగ్ కమిటీల సమావేశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 4 : ఉమ్మడి జిల్లా పరిషత్ స్టాడింగ్ కమిటీల సమావేశం ఈ నెల 13న ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు ఈ సమావేశాలు వేరు వేరు గా జరగనున్నాయి. సమావేశాల నిర్వహణ సమాచారాన్ని జడ్పీ సీఈవో వసంతారాయుడు జిల్లా కలెక్టర్ కు బుధవారం లేఖ ద్వారా తెలిపారు.

ముగ్గురి ఏవోలపై అభియోగాల నమోదు

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫెర్టిలైజర్స్ డీలర్లను ప్రోత్సహించారన్న ఫిర్యాదుల్లో ప్రాథమిక ఆధారాలున్నట్లు నిర్ధారణ కావడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో విధులు నిర్వహించిన ముగ్గురు వ్యవసాయ అధికారులపై ప్రభుత్వం విచారణ నిర్వహించాలని నిర్ణయించింది. వీరిలో ఒక జాయింట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, మండల వ్యవసాయాధికారి ఉన్నారు. ఫెర్టిలైజర్స్‌ని రైతు భరోస కేంద్రాలకు తెప్పించడం, అక్కడ నుంచి రైతులకు విక్రయించే విషయంలో ముగ్గురు అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీని వలన రైతులు ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లి అధిక ధరకు ఫెర్టిలైజర్స్‌ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అప్పట్లో ఫిర్యాదులు రావడంతో ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ జారీ చేసిన ఉత్తర్వులు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి. రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలం రైతు భరోస కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఫెర్టిలైజర్స్ స్టాక్‌ని పొజిషన్ చేయడంలో అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు నిర్లక్ష్యం వహించారు. అప్పటి మండల వ్యవసాయాధికారి ఎం చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ ఉషారాణి, జాయింట్ డైరెక్టర్ ఎం విజయభారతిపై అభియోగాలను నమోదు చేసి విచారణ చేపట్టాలని నిర్ణయించింది. .

కొనసాగిన విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు రెండో రోజు తనిఖీలు కొనసాగించారు. బుధవారం విజిలెన్స్ సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఇతర సిబ్బంది యార్డు పరిపాలన భవనంలో ఫైళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వాటన్నింటిని కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కార్యాలయానికి తరలించారు. ఆయా ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులు, వ్యాపారస్థులు, హమాలీలు, వేమెన్‌ల నుంచి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేసి ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు విజిలెన్స్ వర్గాలు తెలిపాయి.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఆహార వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకోవటానికి దాతలు విరివిగా ముందుకు రావాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొత్తకోట ప్రసాద్, పార్థసారధి, తూర్పు కాపు సంఘం సహకారంతో విజయవాడ వరద బాధితులకు ఆహారం పంపే వాహనానికి బుధవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 2500 భోజనం, వాటర్ బాటిళ్లను పంపించారు. ఆమె మాట్లాడుతూ నాలుగు రోజులుగా వరదముంపులో చిక్కుకుని, సర్వం కోల్పోయిన వారికి సహాయ చర్యలు అందించేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే అనేక మంది తమ వంతు సాయం చేశారని, ఆ సాయం సరిపోదని, ఆర్థిక రూపంలోనే కాకపోయినా సహాయక చర్యల్లో భాగమై కూడా వారిని ఆదుకోవచ్చని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు అందుకోసం ముందడుగు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోనబోయిన శ్రీనివాస్ యాదవ్,దాసరి జ్యోతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఎమ్మెల్యే విజయవాడలోని ఆదర్శనగర్, కార్మికనగర్, లెనిన్‌నగర్‌లలో బుధవారం పర్యటించారు. సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు గుంటూరు ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విజయవాడ వరద బాధితుల కోసం 14,500 లీటర్ల పాలు, పదివేల భోజన ప్యాకెట్లు, 14 వేల వాటర్ బాటిళ్లు, 5000 బిస్కెట్ ప్యాకెట్లు, కొవ్వొత్తులు, దోమల అగరబత్తీలను పంపించారు. వాటిని తీసుకు వెళ్లే వాహనాలకు ఎమ్మెల్యే బుధవారం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ వంతుగా సాయం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ నగరాన్ని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఎంతో శ్లాఘనీయమని అన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే బాబు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈరంటి వర ప్రసాద్, పి.సమత, కె.సత్యం, జె. శేష ప్రభాకర్ రావు, రామకృష్ణ, నిరంజన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



పాలు సరఫరా చేసే వాహనానికి జెండా ఊపుతున్న నసీర్

లక్ష వాటర్ బాటిల్స్ పంపిణీ : మన్నవ

గుంటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ వరద బాధితులకు లక్ష వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. విజయవాడలోని వివిధ ముంపు ప్రాంతాలలో పర్యటించిన ఆయన బాధితులకు వాటర్ బాటిల్స్ అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వ యంత్రాంగం, పార్టీ యంత్రాంగం సహా తామంతా బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



వాటర్ బాటిళ్ల పంపిణీని ప్రారంభిస్తున్న మన్నవ మోహనకృష్ణ

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ

గుంటూరు (మెడికల్) సెప్టెంబర్ 4: వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ రవి వడ్లమాని కోరారు. బుధవారం రెడ్‌క్రాస్ కార్యాలయం నుంచి వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేసేందుకు ఆహారం, మంచినీటి బాటిల్స్‌తో ఉన్న వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి వడ్లమాని మాట్లాడుతూ విజయవాడలోని బాధిత కుటుంబాలకువాటర్స్ బాటిల్స్ బిస్కెట్ ప్యాకెట్లతో కూడిన వాహనాన్ని పంపినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభ వించినప్పుడు ప్రజలను ఆదుకొనేందుకు సంస్థ ముందు ఉంటుందన్నారు. వరద బాధితులను ఆదుకొనేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు సాయికృష్ణ శ్రీనివాస్, ఏ రవిశ్రీనివాస్, అరుణ్‌కుమార్, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



జెండా ఊపి వాహనం ప్రారంభిస్తున్న రవి వడ్లమాని

జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో...

విజయవాడ వరద ముంపులో చిక్కుకున్న బాధితులకు అండగా నిలిచేందుకు గురు కృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ నాయకుల సహకారంతో రెండు వేల మందికి ఆహారం పొట్లాలు, వాటర్ బాటిల్స్‌తో కూడిన వాహనాన్ని బుధవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో తెలుగు యువత

గుంటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తెలుగుయువత విజయవాడ ముంపు బాధితులకు గడిచిన రెండురోజులుగా సేవలు అందిస్తున్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద సంఖ్యలో విజయవాడ తరలి వెళ్లిన యువకలు అక్కడే వుండి సేవలు అందిస్తున్నారు. 'ఆపన్నులకు ఆపన్న హస్తం' పేరుతో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆధ్వర్యంలో 10,000 భోజన ప్యాకెట్లు, మంచినీళ్ల బాటిళ్ల పంపిణీ చేశారు. విజయవాడలోని 45, 46, 47 డివిజన్ల సమన్వయకర్తగా ఉంటూ తెలుగు యువత ద్వారా బాధితులకు సేవలు అందిస్తున్నారని, మరో మూడు రోజులు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని సాయికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎం.బంగారు బాబు, ఎం.రాజేష్, బి.ప్రసాద్, కోటేశ్వరావు, వేణు పాల్గొన్నారు.



సహాయక చర్యల్లో పాల్గొన్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణ

జాతీయ విపత్తుగా ప్రకటించే విషయంపై కేంద్రంలో చర్చ

● విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుతో రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమకు చేతనైనంత వరకు వరద బాధిత ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నామని రాష్ట్రంలో ప్రకృతి విపత్తుపై జాతీయ విపత్తుగా ప్రకటించడానికి కేంద్రంలో నాలుగు విభాగాల సభ్యులు దీనిపై సమీక్ష నిర్వహించి తగు నిర్ణయం తీసుకుంటారని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. బుధవారం గుంటూరు నగర శివారులోని లాలుపురం రోడ్డులో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థాగత సభ్యత్వ నమోదులో మహిళలు, యువత ఎక్కువ సంఖ్యలో చేర్పించాలని పిలుపు నిచ్చారు. దేశంలో ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి పథంలో ఉంచడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని, ప్రజాస్వామ్యంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏపీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కూటమి తరపున పని చేస్తున్నట్లు చెప్పారు. ఏపీలో ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల సంఖ్య పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందు తున్నాయని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు వచ్చే సమావేశాలలో అమలు అవుతుందని అన్నారు. అనంతరం జిల్లా బీజేపీఅధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాలో ఎక్కువ సభ్యత్వం చేసి జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అట్టడుగు ఉన్న చిట్ట చివరి వారికీ చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. పథకాల లబ్ధిదారులను కలిసి బీజేపీ సభ్యులుగా చేర్పి జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. బిజెపి జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ మాట్లాడుతూ బిజెపి పంచనిష్టలు గురించి వివరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, రాష్ట్ర వీవర్ సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పద్మనాభం, మంత్రి సుగుణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి



డీడీ రామలింగేశ్వరరెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న దేవపాల్, రవికుమార్ తదితరులు

ఉపాధ్యాయుల సర్దుబాటులో అవకతవకలను సరిచేయండి

● ఆర్‌జేడీకి మోడల్ టీచర్స్ యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

గుంటూరు, సెప్టెంబరు 4: నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ తక్షణమే నిలిపివేయాలని, అవకతవకలను సరిచేయాలని మోడల్ టీచర్స్ యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గుంటూరు విద్య ఉప సంచాలకులు రామలింగేశ్వరరెడ్డికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్‌నాయకులు బుధవారం ఆర్‌జేడీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను గుంటూరు నగరపాలక సంస్థలో సర్దుబాటు చేయటం నిబంధనలకు వ్యతిరేకమని, వారిని వెంటనే తిరిగి వారి యాజమాన్య పరిధిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలకు పంపాలని కోరారు. దీనిపై ఆర్‌జేడీ సానుకూలంగా స్పందించారని, పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినటు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. దేవపాల్, నగర అధ్యక్షులు వై.మనోజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అర్ఫతుల్లా , పి.రమేష్, కె.గోపి ఉన్నారు.

స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆదుకోండి

● చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు

గుంటూరు, సెప్టెంబరు 4: విజయవాడలోని లోతట్టు ప్రాంతాల్లో వరద బాధితుల కోసం చాంబర్ ఆఫ్ కామర్స్ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. స్థానిక జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, వాసవీ, రోటరీ క్లబ్‌లు, విద్యా సంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అవసరమైతే నేరుగా వెళ్లి అక్కడ అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వస్తు రూపంలో లేదా, ధన రూపంలో సహాయం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యాంక్ ఖాతాలకు లేదా సీఎంఆర్ఎఫ్‌కు నిధులు అందజేయాలని కోరారు. సమావేశంలో ఆతుకూరి నగేష్‌కుమార్, టీఎల్‌వీ వీరాంజనేయులు, షరాబు కృష్ణమూర్తి, గొల్లపూడి కాశీవెంకట రాంబాబు, కొప్పురావూరి ఏడుకొండలు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

● వృక్షాలు సైతం నేలకూల్చడంపై అభ్యంతరాలు

గుంటూరు, సెప్టెంబరు 4: స్థానిక శ్రీనివాసరావుపేటలోని డ్రెయిన్‌లపై ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. నాలుగు రోజులుగా జరుగుతున్న ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. డ్రెయిన్‌లపై అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలను అక్రమ ఆక్రమణ నిర్మూలనా దళం సిబ్బంది తొలగించింది. కాల్వలను విస్తరించటం, ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చకచకా చేస్తున్నారు.

సిబ్బంది అత్యుత్సాహం..

ఆక్రమణల తొలగింపులో భాగంగా కొందరు సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రెయిన్‌లపై ఆక్రమణలు తొలగింపుతో పాటు పక్కనే ఉన్న పచ్చని వృక్షాలను సైతం కూల్చివేయడాన్ని స్థానికులు విమర్శిస్తున్నారు. దశాబ్దాల నాటి ఓ భారీ వృక్షాన్ని కూల్చి వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సిబ్బంది అత్యుత్సాహంపై నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు తెలిపారు.



శ్రీనివాసరావుపేటలో నేలకూల్చిన భారీ వృక్షం

కీలక నిందితుడిని తప్పించారు

● పోలీస్ ఉన్నతాధికారులకు టీడీపీ నాయకుల ఫిర్యాదు

గుంటూరు, సెప్టెంబరు 4 : స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌లోని బీసీ బాలికల వసతి గృహంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలో కీలక నిందితుడిని పోలీసులు తప్పించారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు పార్టీ నేతలు జిల్లా ఎస్పీ, రేంజ్ ఐజీలకు ఫిర్యాదు చేశారు. బాలికల వసతి గృహంలో కిరణ్ కుమార్, కార్తీక్ తోపాటు వాచ్‌మెన్ లక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే స్కూల్ కరస్పాండెంట్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న అజయ్ ఈ కేసులో కీలక నిందితుడని వారు ఆరోపించారు. అజయ్ ద్వారానే కిరణ్ కుమార్, కార్తీక్‌లు హాస్టల్లోకి ప్రవేశించినట్లు వారు తెలిపారు. అజయ్ సహకారంతోనే లక్ష్మి వారికి అవకాశం కల్పించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, బీసీ బాలికల వసతి గృహంతో పాటు కళాశాల విద్యార్థుల వసతి గృహంలోనూ వారికి రక్షణ కరువైందని విద్యార్థులు వాపోతున్నారు. గంజాయి సేవించిన ముఠాలు వసతిగృహం ప్రాంగణంలోకి ప్రవేశిస్తుండడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి వసతి గృహాల్లో జరుగుతున్న, ఇప్పటివరకు చోటు చేసుకున్న పరిణామాలపై పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక దర్యాప్తు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్రమిస్తున్న చంద్రబాబుపై రాజకీయాలు తగదు : ఎస్ఎం షరీఫ్

గుంటూరు, సెప్టెంబరు 4 : ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొని సాధారణ స్థితికి తీసుకొచ్చే అనుభవం, సమర్థత చంద్రబాబుకు మాత్రమే ఉందని మైనార్టీ ఆశయ సాధన సమితి అధ్యక్షులు ఎస్ఎం షరీఫ్ తెలిపారు. స్థానికంగా ఉన్న సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వైపరీత్యాన్ని రాజకీయంగా ప్రాంతాలకు, వ్యక్తులకు, పార్టీలకు ఆపాదించడం దురదృష్టకరమని, ఇటువంటి చర్యను ప్రజలు ఉపేక్షించరని అన్నారు. విజయవాడ నగర పరిస్థితి దృష్ట్యా దీనిని జాతీయ విపత్తుగా పరిగణించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శ్రమిస్తున్న చంద్రబాబుకు సహ కరించకపోగా కొందరు రాజకీయాలు చేయాలనుకోవడం దుర్మార్గమని విమర్శించారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు జానీ బాషా, ఆసిఫ్ రెహమాన్, ఆరిఫ్ పాల్గొన్నారు.

విపత్తు కారణంగా పుట్టినరోజు జరుపుకోలేను : డేగల



డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాన్, వరదల కారణంగా రాష్ట్రం మొత్తం విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న కారణంగా తాను పుట్టినరోజు వేడుకలకు దూరంగా వుంటున్నానని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ తెలిపారు. స్థానిక నగర టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాటాడుతూ విపత్తు కాలంలో ప్రజలు బాధలో ఉండగా తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోలేనని చెప్పారు. పార్టీ నాయకులు, అభిమానులు ఎటువంటి వేడుకలు నిర్వహించవద్దని, ఆ మొత్తాన్ని వరద బాధితుల కోసం ఖర్చు చేయాలని సూచించారు.



బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, డాక్టర్ శ్రీవిద్య

పునరావాస కేంద్రాల్లో దుప్పట్లు పంపిణీ

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 4 : దాతలు అందించిన దుప్పట్లను పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. బుధవారం గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు రామతారక్‌నాథ్ సతీమణి వైద్యులు శ్రీవిద్య అందించిన దుప్పట్లను దోనేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని వరద బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలామృతం, పాల ప్యాకెట్లను కూడా ఎమ్మెల్యే వారికి పంపిణీ చేశారు. వెల్లటూరులోని విశ్వశాంతి విద్యా సంస్థలో డాక్టర్ శ్రీవిద్య అందించిన దుప్పట్లను బాధితులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ పీడీ ఉమా, సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ నగరాజకుమారి, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, జిఎల్‌జి భగవాన్, వి.మహేష్, అనీల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టాభిపురం సీఐగా వీరేంద్రబాబు

గుంటూరు, సెప్టెంబరు 4 : పట్టాభిపురం సీఐగా పి.వీరేంద్రబాబును అటాచ్‌మెంట్‌పై నియమించగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)లో, నెల్లూరు టౌన్‌లో, ఆ తర్వాత నరసరావుపేట టూ టౌన్ సీఐగా విధులు నిర్వహించారు. ఎన్నికల సమయంలో పట్టాభిపురం సీఐగా కొన్ని నెలలు పనిచేశారు. వైసీపీలో గ్రూప్ రాజకీయాల నేపథ్యంలో ఆయనను అప్పట్లో పట్టాభిపురం నుంచి బదిలీ చేశారు. అక్కడి నుంచి ఫిరంగిపురానికి ఆ తర్వాత వీఆర్‌కు వెళ్లారు. తాజాగా వీఆర్ నుంచి వచ్చారు. ఇటీవల పట్టాభిపురం సీఐగా నియమితులైన కిరణ్, ఎమ్మెల్యే భర్తకు సంబంధించిన వివాదంలో నిందితులపై తప్పుడు కేసు నమోదు చేసినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను వీఆర్ కు పంపారు.

రైతుల జేబుకొట్టిన నిందితుడు అరెస్టు

స్థానిక కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓల్డ్ క్లబ్ రోడ్డులో బుధవారం ఆటో ఎక్కిన రైతుల జేబుల్లో రూ. 50 వేలను కొట్టేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. శావల్యాపురం మండలం వేలవారిపాలెంకి చెందిన రాఘవులు తమ్ముడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గుంటూరులోని ఓల్డ్ క్లబ్ రోడ్డులో ఉన్న ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాఘవులు, తమ్ముడు ఆసుపత్రికి వచ్చేందుకు ఆర్టీసీ బస్సు దిగి.. బస్టాండ్ సమీపంలో ఆటో ఎక్కారు. ఓల్డ్‌క్లబ్‌రోడ్డు నుంచి వచ్చి మా స్కాన్ సెంటర్ వద్ద వారు ఆటో దిగిన తర్వాత తమ జేబులో ఉండాల్సిన రూ.50 వేలు కనిపించలేదు. సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఆటో వివరాలు సేకరించి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

భర్త అనుచిత ప్రవర్తనపై కేసు నమోదు

అత్త, భార్యలపై అనుచితంగా ప్రవర్తించిన ఓ ప్రభుత్వ ఉద్యోగిపై నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. ఆర్ అండ్ బి విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మధుబాను కొంతకాలంగా భార్య కోపూరు జయశ్రీని వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో ఆమె నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వేధింపుల కేసు నమోదు చేశారు. తనకు భరణం చెల్లించాలంటూ మరో కేసు కూడా కోర్టులో ఆమె దాఖలు చేసింది. ఆయా కేసుల విచారణకు సంబంధించి కోర్టు వాయిదాలు ఉండటంతో మంగళవారం వారిద్దరూ హాజరయ్యారు. అయితే కోర్టు వద్ద మధుబాను తన భార్యను తీవ్రంగా బెదిరించాడు. తీవ్రస్థాయిలో బెదిరించాడు. బుధవారం వింజనంపాడు సమీపంలోని కళాశాల గోడపై తన భార్య అత్త ఫోన్ నంబర్లు రాసిన మధుబాబు, అక్కడ ఓ చీటీ అంటించి.. శారీరక సంబంధం కోసం ఆయా నంబర్లలో సంప్రదించాలని రాశాడు. ఈ విషయమై భార్య, అత్తలకు ఫోన్‌కాల్స్ రావడంతో వారు అక్కడికి వెళ్లి చూశారు. జయశ్రీ నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు మధుబానును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఆకట్టుకున్న పాండవోద్యోగంలోని ఘట్టాలు

గుంటూరు (తూర్పు)సెప్టెంబరు 4: ప్రముఖ రంగస్థల నటులు, దర్శ కులు శెట్టిపల్లి నాగేశ్వరరావు సంస్మరణ సభ సందర్భంగా బుధవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని వేదికపై ప్రదర్శించిన పాండవోద్యోగంలోని ఘట్టాలు ఆకట్టుకున్నాయి.

ఇలాంటి మల్టీ క్రిమినల్స్ మరెక్కడా లేరు

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు

గుంటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి లాంటి మల్టీ క్రిమినల్స్ దేశంలో మరెక్కడా లేరని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జగన్ రెడ్డిని జనజీవన స్రవంతిలో తిరగనీయకుండా చర్యలు తీసుకోవాలని, ఆయన ప్రజల్లో తిరిగితే విజయవాడలో వచ్చిన వరద బీభత్సం కంటే మానవ సంబంధాలకు చాలా పెద్ద ప్రమాదం వాటిల్లుతుందని విమర్శించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షలు చేస్తుంటే బయటకు ఎందుకు రావడం లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల్లో ఉంటుంటే ఆయన ఇంట్లో ఎందుకు కూర్చోవడం లేదన్న జగన్ వ్యాఖ్యలు తగదని విమర్శించారు.

వరద బాధితులకు విరాళాలు అందించండి : కమిషనర్

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 4 : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అండగా నిలవడానికి విరాళాలు అందించేందుకు పలువురు ముందుకు వస్తుండటంతో, ప్రత్యేకంగా ఒక బ్యాంకు అకౌంట్‌ను ప్రారంభించినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విరాళాలు ఇవ్వదలచిన దాతలు కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్, గుంటూరు డిస్ట్రిక్ట్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్ నం.33260919895, ఐఎఫ్ఎస్‌సి కోడ్ : ఐడిఎఫ్బి 0081061 పేరుతో చెక్ లు, డిడిలు అందించాలని పేర్కొన్నారు. అలాగే, గుంటూరు నగరపాలక సంస్థ కూడా విరాళాలు, వస్తువుల సేకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వరద బాధితుల కోసం రూ. 5 వేలు విరాళం అందించిన నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి రెహ్మాన్‌కి కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జీఎంసీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ లో రెహ్మాన్ ముందుగా విరాళం అందించారు. ఈ నగదుని సీఎం రిలీఫ్ ఫండ్‌కి జమ చేశారు.

యునైటెడ్ వాకర్స్ గ్రూప్ వితరణ

గుంటూరు, సెప్టెంబరు 4: విజయవాడలోని వరద బాధితులకు సహాయంతో పాటు తాము భాగస్వామ్యం కావాలన్న సంకల్పంతో గుంటూరు యునైటెడ్ వాకర్స్ గ్రూప్ ముందుకొచ్చింది. నలభైకు పైగా కుటుంబాలకు ఐదు రోజులకు సరిపడా రేషన్ కిట్లు రూ.50,400 విలువ చేసే వాటిని అక్షయ ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేశారు. పంపిణీలో గ్రూప్ సభ్యులు ప్రొఫెసర్ వైవీ రెడ్డి, డాక్టర్ రసూల్, డాక్టర్ శేషయ్య, రవికుమార్ తది తరులు హాజరయ్యారు. మరో విడత సహాయం చేపడతామని ముద్దన నాగేశ్వరరావు, ఆడిటర్ హరినాధ్ తెలిపారు. సహాయ సహకారాలు అందించటంలో సహకరించిన అక్షయపాత్ర ప్రతినిధి రాజేష్ తదితరులకు గ్రూప్ తరఫున డాక్టర్ ఎండీ మస్తాన్‌వలి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రొఫెసర్ వైవీ రెడ్డి, డాక్టర్ శేషయ్యతో యునైటెడ్ వాకర్స్ సభ్యులు

లంక గ్రామాల్లో ఆకలి తీరుస్తున్న 'అమ్మ' ట్రస్టు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4 : ప్రజల కు ఏ కష్టం మొచ్చినా సహాయానికి ముందుండే గుంటూరు కు చెందిన అమ్మ చారిటబుల్ ట్రస్టు వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలను అక్కున చేర్చుకుంది. గత నాలుగైదు రోజులు గా ఎంతో శ్రమించి లంక గ్రామాల్లో ఆహార పదార్థాలను అందజేస్తోంది. 'అమ్మ' సేవకులు బుధవారం కొల్లూరు మండలంలోని లంకగ్రామాలు అన్నవరపు లంక, కొత్తూరు లంక, తుమ్మలూరు,బొమ్మావారిపాలెంలో ప్రజలకు ఆహారపు పొట్లాలను, అవసరమైన సరుకులను అందజేశారు. స్వామి జ్ఞాన ప్రసన్న ఆదేశాల మేరకు ఈసేవా కార్యక్రమాలు చేపట్టామని ట్రస్టు సేవకులు తెలిపారు.



ప్రజలకుఆహార పదార్థాలను అందజేస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్టుసేవకులు

కారుణ్య నియామకాలకు విధి విధానాలు : ఈదర

గుంటూరు, సెప్టెంబరు 4 : కారుణ్య నియామక పద్ధతిలో ఉద్యోగులను నియమించే విధి విధానాల గురించి రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో వివరించారు. కారుణ్య నియామకాలు చనిపోయిన ఉద్యోగి పనిచేసిన కార్యాలయంలో పోస్టు ఖాళీగా ఉన్న సందర్భంలో ఆ పోస్టుల్లో నియమించవచ్చని, ఒక వేళ కార్యాలయంలో ఖాళీలేని సందర్భంలో ఆ శాఖ ఆధ్వర్యంలో జిల్లా యూనిట్‌లో ఎక్కడైనా ఖాళీ ఉన్న పోస్టులో నిబంధనల మేరకు నియమించాలని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టు జిల్లా యూనిట్ పరిధిలోకి వస్తుందని, ఒక వేళ ఆ శాఖ జిల్లా యూనిట్‌లో పోస్టు ఖాళీ లేని సందర్భాల్లో తగు చర్య నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు వివరాలు పంపాలని, అందుకు తగిన పోస్టు ఇతర శాఖలలో ఖాళీ ఉంటే కనుక నియామకపు ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా సంబంధిత అధికారికి కలెక్టర్ తెలియజేస్తారని పేర్కొన్నారు. మరణించిన ఉద్యోగిపై ఆధారపడి జీవిస్తున్న వ్యక్తికి ఉద్యోగం కల్పించే సందర్భంలో ఆ వ్యక్తి నాన్ లోకల్ అయితే ఆరు సూత్రాల పథకం ఆధారంగా స్థానికేతర కేటాయింపు కిందనే ఉద్యోగం కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ రూల్స్ 1996లోని రూల్ 22లో నిర్దేశించిన ప్రకారం రిజర్వేషన్ నియమ నిబంధనలు కూడా ఈ విషయంలో పాటించాల్సి ఉంటుందని, నియమనిబంధనల మేరకు రిజర్వేషన్ పోస్టు ఖాళీ లేనప్పుడు ఓసీ పోస్టులో షెడ్యూల్ క్యాస్ట్, వెనుకబడిన జాతుల వారిని నియమించవచ్చని తెలిపారు. రోస్టర్ పాయింట్‌లో సంబంధిత రోస్టర్‌కు అనుగుణంగా ఖాళీ లేనప్పుడు కొన్ని రిజర్వ్‌డ్ పోస్టుల తరువాత ఓసీ పోస్టులు ఖాళీ ఉంటే ఆ ఓసీ ఖాళీలలో ఓసీనీ గాని ఎస్సీలను గాని నియమించవచ్చని వివరించారు. కారుణ్య నియామకాలు సర్వీసు కమిషన్ పరిధిలోకి, ఉద్యోగ ఉపాధి కార్యాలయ పరిధిలోకి, జిల్లా సెలక్షన్ కమిటీ పరిధిలోకి గాని రావని, కారుణ్య నియామకాలు డైరెక్ట్ కోటా కింద నియమించాల్సి ఉందని తెలిపారు.

మేమున్నామని.. మీకేం కాదని..

వరద బాధితులకు సినీ ప్రముఖుల సాయం






వరదలతో ఇబ్బంది పడుతున్న తెలుగు ప్రజానీకాన్ని ఆదుకునేందుకు కొంతమంది సినీ ప్రముఖులు ఇప్పటికే తమవంతు సాయాన్ని అందించగా బుధవారం మరికొందరు విరాళాలను ప్రకటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చిరంజీవి రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ. 50 లక్షలు ఇస్తున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'వరద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు నన్ను కలిచివేశాయి. పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందరూ తమకు తోచినట్లు సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి. ఈ విపత్కర పరిస్థితులు త్వరలోనే తొలగిపోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. చిరు తనయుడు రామ్‌చరణ్ సైతం రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. తెలుగు ప్రజలకు అందరూ అండగా ఉండాల్సిన సమయమిదని రామ్‌చరణ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వరద బారిన పడిన 400 పంచాయతీలకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. నాలుగు కోట్ల సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ తన వంతుగా రూ. రెండు కోట్ల విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. కోటి చొప్పున అందజేయనున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. అల్లు అర్జున్ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ విపత్కర పరిస్థితులు తొలగిపోయి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వరద బాధితులను ఆదుకునేందుకు అక్కినేని కుటుంబం, గ్రూపు సంస్థలు రెండు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించాయి. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 25 లక్షల సాయాన్ని ప్రకటించిన వైజయంతీ మూవీస్ సంస్థ తాజాగా తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 20 లక్షల విరాళాన్ని ప్రకటించింది. నిర్మాత అశ్వనీదత్ బుధవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్ అందజేశారు. హీరో సాయిదుర్గ తేజ్ ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. 20 లక్షలు, విజయవాడలోని అమ్మ ఆశ్రమానికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించారు. అలీ, జుబేదా దంపతులు ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. ఆరు లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ - రూ. 2 కోట్లు (ఏపీలోని గ్రామ పంచాయితీలకు రూ. 4 కోట్లు)
ప్రభాస్ - రూ. 2 కోట్లు
చిరంజీవి - రూ. కోటి
రామ్‌చరణ్ - రూ.కోటి
అల్లు అర్జున్ - రూ. కోటి
అక్కినేని కుటుంబం, గ్రూప్ సంస్థలు కలిపి - రూ. కోటి
సాయిదుర్గ తేజ్ -రూ.20 లక్షలు
వైజయంతీ మూవీస్ - రూ. 20 లక్షలు (తెలంగాణకు)
అలీ, జుబేదా దంపతులు - రూ. 6 లక్షలు

సమంతకు గాయం



టాలీవుడ్ కథానాయిక సమంత గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆమె బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఎప్పుడు, ఎలా గాయపడ్డారు అనే వివరాలను ఆమె వెల్లడించలేదు. మోకాలి గాయానికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్స తీసుకుంటున్నారు సమంత. తన శరీరంలో రెండు సూదులు గుచ్చి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేసి, 'గాయాల బారిన పడకుండా యాక్షన్ స్టార్‌ను అవ్వగలనా?' అని సరదాగా స్పందించారు. దీంతో సమంత లీడ్‌రోల్‌లో నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారని భావిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల నిషేధం

నడిగర్ సంఘం మహిళా భద్రతా కమిటీలో తీర్మానం



నటీమణులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు రుజువైతే చిత్రపరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నడిగర్ సంఘం నిషేధం విధించనుంది. ఈ మేరకు నడిగర్ సంఘం అనుబంధ విభాగమైన మహిళా భద్రతా కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ కమిటీ సమావేశం బుధవారం నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తీ, కమిటీ అధ్యక్షురాలు రోహిణి సారథ్యంలో కమిటీ సభ్యులు సుహాసిని, ఖుష్బూ, లలిత కుమారి, కోవై సరళ తదితరులు పాల్గొన్నారు. ఇందులో కొన్ని తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ జరిపి నిజమని తేలితే చిత్ర పరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నిషేధం విధించేలా తీర్మానం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, న్యాయ సలహాలు ఇప్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని తొలుత హెచ్చరించి, ఆ తర్వాత చర్యలకు ఉపక్రమిస్తారు. కమిటీకి ఫిర్యాదు చేసే బాధితులు మీడియాతో ప్రత్యక్షంగా మాట్లాడకూడదు. యూట్యూబ్‌లో సినీ నటులను కించపరిచేలా మాట్లాడేవారిపై బాధితులు సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి కమిటీ అన్ని విధాలా సహకరిస్తుంది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



కొరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర 1' చిత్రం నుంచి మాస్ నంబర్‌ను విడుదల చేశారు. 'కొరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా' అంటూ రామజోగయ్యశాస్త్రి రాసిన పాట వీడియోను విడుదల చేశారు. ఈ పాటలో ఎన్టీఆర్ వేసిన స్టెప్పులు ఆడియన్స్‌తో డాన్స్ చేయించేలా ఉన్నాయి. ఎన్టీఆర్ డాన్స్ ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారో దాన్ని మించేలా శేఖర్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. జాన్వీకపూర్ గ్లామరెస్‌గా కనిపించారు. ఎన్టీఆర్‌తో పోటీగా స్టెప్స్ వేశారు. 'దేవర' మీద ఇప్పటివరకూ ఉన్న అంచనాలు ఈ పాటతో నెక్స్ట్ లెవల్‌కు చేరాయి. అనిరుధ్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. హై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'దేవర' రెండు భాగాలుగా ప్రేక్షకులను అలరించనుంది. మొదటి భాగాన్ని ఈ నెల 27న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ నిర్మిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

విడుదల వాయిదా



'ఈ నెల ఏడున 'జనక అయితే గనక' సినిమాను విడుదల చేయాలనుకున్నాం.అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితుల కారణంగా విడుదల వాయిదా వేస్తున్నాం. నవ్వుల వినోదం పండించే రోజుని త్వరలో ప్రకటిస్తాం. ప్రేక్షకులు అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన సినిమా కనుక ఈ నిర్ణయం తీసుకున్నాం' అని వెల్లడించారు దిల్ రాజు. సుహాస్ హీరోగా రూపుదిద్దుకున్న 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'మూవీ ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా బాగా నచ్చింది. అందుకే యుఎస్‌ఏ హక్కులు కొన్నాను. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ యువకుడిగా నటించా. దిల్ రాజుగారు ఎంతో సపోర్ట్ చేశారు' అన్నారు.

పిల్లలతో చూడాల్సిన సినిమా



ప్రియదర్శి, విశ్వదేవ్, నివేద థామస్, గౌతమి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నందకిశోర్ ఈమాని దర్శకత్వంలో రానాదగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'ఇది పిల్లలతో కలసి చూడాల్సిన సినిమా. దర్శకుడు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా తెరకెక్కించార'ని ప్రశంసించారు.

మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది



వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు మీనాక్షీ చౌదరి. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ సరసన ఆమె నటించిన 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీనాక్షీ మీడియాతో పంచుకున్నారు.


"ఈ సినిమాలో నాది చాలా మంచి పాత్ర. ఆ పాత్ర నన్ను నేను రిలేట్ చేసుకునేలా ఉంటుంది. దర్శకుడు వెంకట్ ప్రభు ఈ సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు. ఈ మూవీ షూటింగ్ సమయంలో విజయ్, స్నేహ, లైలా వంటి అనుభవజ్ఞులైన నటుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమా అందరికీ మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది. విజయ్ యాక్టింగ్, వెంకట్ ప్రభు డైరెక్షన్ స్కిల్స్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి" అని చెప్పారు.

ఫిష్ వెంకట్‌కు సాయం



విలన్ పాత్రల్లోనూ తనదైన శైలిలో కామెడీని పండిస్తూ తెలుగు ప్రేక్షకులను నవ్వించిన ఫిష్ వెంకట్ రెండు కిడ్నీలు పాడై దయనీయ స్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఖర్చు పెట్టే స్తోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సినిమాల్లో నటించమని పిలుపు వస్తున్నా ఒంట్లో సత్తువ లేక కొన్నేళ్ల నుంచి ఇంటికే పరిమితమైనట్లు చెప్పారు. ఖర్చులకు చేతిలో పైసా లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలను అందజేశారు. ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, కె.అజయ్‌కుమార్, అనిల్ ఈ చెక్కును ఫిష్ వెంకట్‌కు అందజేశారు.

జేఎన్‌టీయూకేలో ఎంటెక్ స్పాన్సర్డ్ కోటా



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కనీసం ఏడాది అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- ★ సివిల్ ఇంజనీరింగ్ - స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- ★ మెకానికల్ ఇంజనీరింగ్ - క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ - కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- ★ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ.
- ★ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ - రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- ★ బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఏఐఎంఈ లేదా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్/బయోటెక్నాలజీ/ఎర్త్‌సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/జియాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్ ఉండాలి.

- ★ **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- ★ **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/cHqjyDZలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

స్వర్ణ పతక విజేత సాదియాకు ఘన స్వాగతం



సాదియా అల్‌మాస్‌కు స్వాగతం పలుకుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 4: మాల్టా దేశంలో జరిగిన ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన మంగళగిరికి చెందిన సాదియా అల్‌మాస్ బుధవారం స్వదేశానికి తిరిగివచ్చారు. సాదియాతోపాటు ఇదే పోటీల్లో పాల్గొని 6వ స్థానం సాధించిన తెనాలికి చెందిన ఎం షానూన్ స్వదేశానికి రాగా, గన్నవరం విమానాశ్రయం వద్ద జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. సాదియా అల్‌మాస్ ఈ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించడానికి ఆర్థిక సహకారం అందించిన రాష్ట్ర మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌కు సాదియా తండ్రి కోచ్ షేక్ సంధాని కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పీ భాస్కరరావు ఎస్‌కే సుభానీ వలపర్ల శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



పెదకొండూరులో బియ్యం నిత్యావసరాలను రెవెన్యూ అధికారులతో కలిసి అందిస్తున్న టీడీపీ నాయకులు

దుగ్గిరాల, సెప్టెంబరు 4: వర్షాలు, వరదలతో నిరాశ్రయులై పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలను బుధవారం అందించారు. పెదకొండూరులో వరదలకు కరకట్టలోపలి వైపున నివాసముంటున్న 7 పేద కుటుంబాలను ఖాళీ చేయించి, స్థానిక జడ్పీ హైస్కూల్ పునరావాసం ఏర్పాటు చేసిన విషయం విదితమే. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ పూర్తిస్థాయిలో నీరు తొలగకపోకపోవడంతో వారికి అవసరమైన బియ్యం, ఇతర నిత్యావస రాలను అందించారు. ఇండ్లలోకి నీరుచేరి ఇబ్బందులను ఎదుర్కొంటూ పునరావాస కేంద్రంలో ఉంటున్న ఈమనికి చెందిన బాధిత 37 కుటుంబాలకు నిత్యావసరాలను అందించారు. తహసీల్దార్ సునీత, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ప్రధాన కార్యదర్శి తాళ్ల అశోక్, మండల జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ప్రసాద్, యడ్లసాయి కృష్ణ, వినోద్, కాసరనేని కృష్ణ, ఎంపీటీసీ సాయి చైతన్య, మొలబంటి ధనుంజయ, మాజీ సర్పంచ్ తోట పిచ్చయ్య, కానుమోలు సత్యనారాయణ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ అధికారుల సలహాలు పాటించాలి

● మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి



రైతులకు సూచనలిస్తున్న ఏవో కిరణ్మయి

కాకుమాను, సెప్టెంబరు 4: వరి సాగు చేసిన రైతులు వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చే సలహాలు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి అన్నారు. మండలపరిధిలోని కొల్లిమర్ల, చిన్నలింగాయపాలెం, కేబీ పాలెం గ్రామాల్లో బుధవారం వరద ప్రభావంతో దెబ్బతిన్న పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి నాలుగు రోజులు నుంచి ఐదు రోజుల వరకు నీళ్లలో తట్టుకుటుందన్నారు. వరద బయటకు వెళ్లిన అనంతరం 30 కిలోల యూరియా, 15కిలోల ఎంవోపీ కలపి చల్లాలన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు, ఎంపీఈవో శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నదీ పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించాలి

తాడేపల్లి, సెప్టెంబరు 4: కృష్ణానది పరివాహక ప్రాంతంలో కరకట్ట మధ్యలో నది పొడవునా ఉన్న భూముల్లో బిల్డింగ్‌లు, ప్రహరీలు, కరకట్ట నుంచి కృష్ణానదిలోకి కట్టడం వల్ల కృష్ణానది ముంపునకు గురై నీరు వచ్చిందని, కట్టడాలు లేకపోతే వరదనీరు వచ్చేది కాదని ఒకటి రెండు అడుగుల మేర నీరు తక్కువ ఉండేదని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. బుధవారం రైతు సంఘం నేతలతో కలిసి కొండవీటి వాగు నదీ ప్రవాహ ప్రాంతంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కొండవీటి వాగులో నుంచి కృష్ణానదిలోకి ఉండే హెడ్ స్లూయిజ్ గేట్లు వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. నదీతీర ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి నదీ పరివాహక ప్రాంతాన్ని పారుదల ప్రాంతంగా ఉంచితే ముంపు ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జొన్నా శివశంకర్, రాజధాని రైతు సంఘం నేతలు కొర్రపోలు ఈశ్వర్‌రెడ్డి, దొంతిరెడ్డి వేమారెడ్డి, బక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడికొండ, సెప్టెంబరు 4: తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి సూచించారు. బుధవారం తాడికొండలో పొలాలను పరిశీలించారు. కంతే రు - తాడికొండ మధ్యలో ఉన్న ఎర్రవాగు చప్టాను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షంలో నీటి మునిగిన మెట్ట పొలాలు ఎకరాకు రూ.15 వేలు, మాగాణికి రూ.20 వేలు పరిహారం చెల్లించాలన్నారు. తక్ష ణమే పంట అంచనాలు వేయాలన్నారు. ఎరువులు, పురు గుమందులు, విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం త్వరగా ఆదుకోవాలన్నారు. వరద ఉధృతికి ఎర్ర వాగు చప్టా ప్రమాదకరంగా మారిందన్నారు. తాడికొండ - కంతేరు రహదారి పూర్తిగా ధ్వంసమై రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. మోకాళ్ల లోతులో గుం తలు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం స్పందించి వంతెనను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసా య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం కొండ సత్యానందం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాల పంపిణీ

తాడికొండ, సెప్టెంబరు 4: నాలుగు రోజులుగా వరదలో చిక్కుకున్న బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేయటం అభినందనీయమని సీఐ కే వాసు అన్నారు. మహా నాడులో వరద ముంపునకు గురైన ప్రజలకు ఆహార పానీయాలు లేక ఇబ్బంది పడటంతో తాడికొండ భవానీ పీఠం వ్యవస్థాపకులు కొల్లిపర నాగ కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను పంపిణీకి సిద్ధం చేశారు. ఆహార పొట్లాలను తీసుకెళ్లే వాహనాన్ని సీఐ వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దాతలు, ఎన్‌జీవో సంస్థలు ముందుకు వచ్చి అపదలో ఉన్నవారిని అదుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంపై ప్రతి ఒక్కరు సహాయ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో భవాని పీఠం ప్రధాన కార్యదర్శి శర్వాణి బాలాజీ శర్మ, కోశాధికారి సుభాషిణి దినేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాలు

● దెబ్బతిన్న కూరగాయ, వాణిజ్య పంటలు
● పరిశీలించిన ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు
● రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్



ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పొలాలను సీపీఐ, రైతు సంఘం నేతలు బుధవారం పరిశీలించారు. పెదవడ్లపూడి, చినవడ్లపూడి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న, పసుపు, అరటి, కంద, మినుము, వంగ, క్యాలీఫ్లవర్, దొండ పంటలు పూర్తిగా నీట మునిగాయని చెప్పారు. కాలువల్లో నీటి పారుదల లేక వరద నీరు పంట పొలాలను ముంచెత్తిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, జవ్వాది సాంబ శివరావు, పొదిలి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి మండలంలో..



ఇప్పటంలో నీట మునిగిన పంట పొలాలు

తాడేపల్లి, సెప్టెంబరు 4: మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో ముంపునకు గురైన పంట పొలాలను టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు స్థానిక నేతలు జనసేన నేతలతో కలిసి బుధవారం పరిశీలించారు. రైతులను కలిసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ పంట పొలాల్లో నీరు నిలిచిపోతుందని తూములు ఏర్పాటు చేయాలని ఇప్పటం వడ్డేశ్వరం మధ్య ఈ ఇబ్బంది ఉందని, నిలిచిన నీరు బకింగ్‌హమ్ కెనాల్‌లోకి వెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నేత శంకరశెట్టి పిచ్చియ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

● పంటనష్టపోయిన రైతులకు ఎన్యుమరేషన్ చేసి పంట నష్టపరిహారం అందించాలని గుంటూరు పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రాతూరు, గుండిమెడ, రామచంద్రాపురం, వీర్లపాలెం గ్రామాల్లో నీటి మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పలుచోట్ల పంట పొలాలు పూర్తిగా నీట మునిగిన రైతులు నష్టపోయారని, పసుపు, అరటి, కంద, గులాబీ, సొరకాయ, కాలీఫ్లవర్ వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఉద్యాన అధికారులు పంట పొలాలను బాధిత రైతులతో కలిసి పరిశీలించారని, మంత్రి నారా లోకేశ్ దృష్టికి నీట మునిగిన పంటల విషయాన్ని తీసుకెళ్లామని అధికారులు చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలని రైతుల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుండిమెడ గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, తమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, పాములు, రఘు, శ్రీనివాసరావు, వెంకయ్య, వీరారెడ్డి నరేష్, బాబూరావు, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో పంట పొలాలను పరిశీలిస్తున్న కళ్లం రాజశేఖర్‌రెడ్డి

వరద బాధితులకు పెమ్మసాని ఫౌండేషన్ సాయం

తుళ్లూరు, సెప్టెంబరు 4: వరద బాధితులకు పెమ్మసాని ఫౌండేషన్ తరపున సాయం అందించారు. వెంకటపాలెం, తాళ్లయపాలెం, హరిశ్చంద్రపురం గ్రామాల్లో వరద బాధితులను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు రవిశంకర్ బుధవారం పరామర్శించారు. పెమ్మసాని ఫౌండేషన్ ద్వారా సుమారుగా 2వేల మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. లంకల్లో ఉన్న వరద బాధితులందరిని ఒడ్డుకు తీసుకొచ్చి పునరావాసం కల్పించామని తెలిపారు. వాగుల్లో వచ్చిన వరద నీటిని బయటకు పంపడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రవి శంకర్ మాట్లాడుతూ పెమ్మసాని ఫౌండేషన్ తరపున వరద బాధితులకు సాయం కొనసాగుతుందన్నారు. ఎవరూ కూడా అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం నుంచి కూడా పూర్తి స్థాయిలో సాయం అందుతుందన్నారు. తొలుత వెంకటపాలెం ఎంపీపీ పాఠశాల పునరావాస కేంద్రంలో వరద బాధితులను పరామర్శించారు. పెదపరిమికి చెందిన కావూరు దాసు రూ.50వేలు వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కును ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, పెమ్మసాని రవి శంకర్ కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు, టీడీపీ నాయకులు బెల్లంకొండ నరసింహారావు, బత్తుల కోటేశ్వరావు, కొండెపాటి సతీష్‌చంద్ర, వాకచర్ల వీరాంజనేయులు, కొమ్మినేని కోటేశ్వరరావు, జమ్ముల అనిల్ పట్టయ్య, జనసేన నేతలు పాల్గొన్నారు.



వరద బాధితులకు 50వేలు చెక్కును ఎమ్మెల్యే, పెమ్మసాని రవి శంకర్ కు చెక్కును అందజేస్తున్న పెదపరిమి వాసి కావూరు దాసు

అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు : పోతినేని



వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు పంపిణీచేస్తున్న ట్రస్టు ప్రతినిధుల

మంగళగిరి, సెప్టెంబరు 4: వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరికి చెందిన గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, భగీరథ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధితులకు బుధవారం రెండు వేల భోజనం ప్యాకెట్లు పంపించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వారికి భోజనం, తాగునీరు వంటి పంపిణీ చేయడం, ముంపు నివారణకు పరిష్కార మార్గాలను చూపడం వంటి సహాయక చర్యలను సీఎం చంద్రబాబు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో ముంపుకు గురైన మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాలపై మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారని, ముంపు నివారణా చర్యలతోపాటు బాధితులకు భోజనం, వసతి, తాగునీరు, బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలను పంపిణీ చేస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ కాండ్రు శ్రీని వాసరావు, టీడీపీ నేతలు జొన్నాదుల బాలకృష్ణ, గోవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ స్ఫూర్తితో వరద బాధితుల సహాయార్థం మేముసైతం

దుగ్గిరాల, సెప్టెంబరు 4: వరద బాధితులను ఆదుకోవాలన్న మంత్రి నారా లోకేశ్ పిలుపుతో మేము సైతం స్థానిక రైలుపేటలోని టిఫిన్ సెంటర్ నడిపే కాటూరి సురేష్ అల్పాహారాన్ని మహానాడులో బాధిత 500 కుటుంబాలకు అందించారు. తన టిఫిన్ సెంటర్‌కు సెలవుపెట్టి మరీ బాధితుల కోసం టిఫిన్‌ను సిద్ధం చేసి దుగ్గిరాల నుంచి ఆటోలో తరలించుకు వెళ్లి బాధిత కుటుంబాలకు అందించడాన్ని పలువురు అభినందిస్తున్నారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, మేఘావత్ శంకర్‌నాయక్ దుగ్గిరాల నుంచి నాయుడు శశిధర్, కంచర్ల గోపాల్, ఉన్నం సురేష్, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల రైలుపేట నుంచి మహానాడులో బాధితులకు అందించేందుకు ఆహారాన్ని తీసుకెళుతున్న తెలుగుయువత నాయకుడు సురేష్

రవి తదితరులు పాల్గొన్నారు.

1500 మందికి భోజనం పంపిణీ

తాడేపల్లి, సెప్టెంబరు 4: వడ్డేశ్వరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదన రావు మంత్రి లోకేశ్ స్ఫూర్తితో వరద బాధితుల సహాయార్థం మూడో రోజు బుధవారం మహానాడు వరద బాధితులు 1500 మందికి భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత కాట్రగడ్డ మధుసూదన రావు, గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, వడ్డేశ్వరం రాజారావు, అబ్రహం, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

మంగళగిరి, సెప్టెంబరు 4: ఆత్మకూరు గ్రామంలో పునరావాసం పొందుతున్న ముంపు ప్రాంత బాధితులకు తాటి వెంకటరావు ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందజేశారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధా న కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతినేని శ్రీనివాసరావు, కూటమి నేతలు కృష్ణ, కొమ్మా శివకుమార్, కొమ్మా లవకుమార్, మాణిక్యరావు,

బాధితులకు చేయూత

పెదనందిపాడు, సెప్టెంబరు 4: కృష్ణా జిల్లాలో వరద బాధితులకు చేయూతనందించేందుకు టీడీపీ మండల అధ్యక్షుడు విక్రయాల సుబ్బారావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుల వితరణ చేశారు. బుధవారం వరద బాధితులకు పులిహోర, పెరగన్నం, వాటర్ ప్యాకెట్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, రావిపాడు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పత్తి సాగులో విప్లవాత్మకమైన మార్పు

● మోడల్ విలేజ్‌గా కొర్నెపాడు సీఐఆర్ డైరెక్టర్ వైజీ ప్రసాద్



పత్తి పంటను పరిశీలిస్తున్న డైరెక్టర్ ప్రసాద్

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 4: ఆంధ్రప్రదేశ్‌లో పత్తి సాగుకు ప్రోత్సాహాన్ని అందించడంలో ఐసీఏఆర్, సీఐసీఆర్ కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఐసీఆర్ డైరెక్టర్ వైజీ ప్రసాద్ అన్నారు. మండలంలోని కొర్నెపాడు గ్రామ పరిధిలోని పత్తి పొలాలను బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం లాం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారి, రైతులతో కలసి క్షేత్ర స్థాయిలో డాక్టర్ వైజీ ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల నుద్దేశించి పత్తి సాగు విధానాలు, రైతులకు కలిగే లాభాలను ఆయన వివరించారు. పత్తి సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకొని రావడంలో అధిక సాంద్రత కలిగిన మొక్కల పెంపకం వ్యవస్థ(హెచ్‌డీపీఎస్) పరివర్తన సామర్థ్యాన్ని నిర్దేశిస్తుందన్నారు. ప్రత్తిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం గురించి డాక్టర్ ప్రసాద్ వివరించారు. పత్తిసాగుకు హెచ్‌డీపీఎస్ పద్ధతికి రైతులు ఉత్సాహంగా ఆదరణ చూపడంతో పత్తి సాగులో కొర్నెపాడు గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా గుర్తిస్తున్నట్లు రైతుల సమక్షంలో ప్రసాద్ ప్రకటించారు.

థర్మల్ ఫాగింగ్ మిషన్ అందజేత



దోమల నివారణకు థర్మల్ ఫాగింగ్ మిషన్ అందజేత

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 4: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో దోమల నివారణకు థర్మల్ ఫాగింగ్ మిషన్‌ను ఉప్పుటూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చిన్న రాములు, గుంటుపల్లి శివరామకృష్ణ అందజేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సీతామహలక్ష్మి జ్ఞాపకార్థం సొంత నిదులతో దీనిని అందించారు. అలాగే వర్ష ప్రభావం వల్ల చెరువుకు గండి పట్టడంతో సొంత నిధులతోనే చెరువుకట్టను నిర్మాణం చేశారు. అలాగే గ్రామానికి కావలసిన ప్రతి అవసరా లను ఎన్ఆర్ఐ అయిన ఉప్పుటూరి రామ్‌చౌదరి వారి తల్లిదండ్రులకు అండదండగా గ్రామానికి ఆర్థిక సాయం చేయడంలో ముందున్నారు.

హత్యాయత్నం కేసులో రౌడీ షీటర్ అరెస్టు

తుళ్లూరు, సెప్టెంబరు 4: రాజధాని ప్రాంతంలో నిర్మితమైన ఐఏఎస్, ఐపీఎస్ భవనాల సముదాయల వద్ద మందు తాగుతున్న సరిగల మహేష్‌ను బుధవారం రాత్రి పది గంటల సమయంలో తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై విజయవాడలో హత్యాయత్నం వంటి 4కేసులు, తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో 3కేసులు మహేష్‌పై ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



ట్రాక్టర్‌పై ఆహారం, నీళ్లు సరఫరా చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

దాతలు ముందుకు రావాలి : ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 4: వరదలో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్న విజయవాడ వైఎస్సార్ కాలనీలో ప్రత్తిపాడు ఎమెల్యే బూర్ల రామాంజనేయులు సహాయక చర్యలు చేపట్టారు. నియోజకవర్గం నుంచి 50 మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయవాడ చేరుకున్న ఆయన అక్కడ సహాయక చర్యల్లో పాల్గొని 10000 బ్రెడ్ ప్యాకెట్లు, 3000 మంచినీటి బాటిల్స్, క్యాటరింగ్ అసోసియేషన్ సాయంతో.. 5000 వాటర్ బాటిల్స్, గుంటూరు 46 డివిజన్ కార్పొరేటర్ నూక వరపు బాలాజీ గారి సాయంతో 5000 భోజనం ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర మీడియా కోర్డినేటర్ గింజుపల్లి వెంక టేశ్వరావు, గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాస్, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, పంచుమర్తి శేషు, కల్లూరి అవినాష్, గుంటుపల్లి కుమార స్వామి, పెండ్యాల శ్రీధర్, పసుపులేటి గంగాధర్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

● సముద్రంలోకి 3 లక్షల 16వేల 434 క్యూసెక్కులు
● డెల్టా కాలువలకు 202 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 4: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. గడిచిన 48 గంటల్లో 8 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతి తగ్గింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రధాన వాగుల నుంచి బుధవారం 3లక్షల 16వేల 636 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.5 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 57 గేట్లను 8 అడుగుల మేర, 13 గేట్లను పూర్తిగా ఎత్తి దిగువకు 3లక్షల 16 వేల 434 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 202 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. కాగా వరద ఉధృతి తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నట్టు జేఈ తెలిపారు.

చేనేత కుటుంబాలకు నిత్యావసరాల అందజేత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 4: భారీ వర్షాలతో ముంపునకు గురై ఉపాధి కోల్పోయిన మంగళగిరి పట్టణంలోని చేనేత కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసర సరుకులను అందజేసింది. రాష్ట్ర మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ ఆదేశాలతో కూటమి నాయకులు అధికారులతో కలిసి చేనేత కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెనాలి సబ్‌కలెక్టరు సంజనా సింహా మాట్లాడుతూ చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం, నూనె, కిలో పంచదార, కిలో కందిపప్పు, కూరగాయలను అందించామని తెలిపారు. మొత్తం 1455 కుటుంబాలకు వీటిని అందజేసినట్టు చెప్పారు. చేనేత కార్మికులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనరు అలీమ్ బాషా, చేనేత జౌళి శాఖ జిల్లా ఏడీ వనజ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాండ్రు భానుకిషోర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుమూలి - నంబూరు మధ్య నల్లమడ వాగుకు గండి

● యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేత పనులు



నల్లమడ వాగుకు పడిన గండిని పూడ్చుతున్న నీటిపారుదలశాఖ సిబ్బంది

దుగ్గిరాల సెప్టెంబరు 4: మండలపరిధి పెనుమూలి - నంబూరు మధ్య గల నల్లమడవాగుకు పడిన గండిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేస్తున్నారు. నంబూరు సమీపంలో పొలాలు ముంపునకు గురికావడంతో రైతులు స్థానిక టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ శ్రేణులు మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో యుద్ధప్రాతిపదికన గండిని పూడ్చాలని ఆదేశాలు జారీ చేశారు. నీటిపారుదల శాఖ ఈఈ మల్లికార్జునరావు, డ్రైనేజీ ఈఈ వెంకట రత్నం, డీఈ అనిల్ తదితర అధికారుల పర్యవేక్షణలో పెద్ద ఎత్తున గండిపూ డ్చే పనులను చేపట్టారు. వందలాది ఎకరాలకు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున త్వరగా చర్యలు తీసుకోవాలని నారా లోకేశ్ నుంచి స్పష్టమైన ఆదే శాలు రావడంతో హుటాహుటిన గండిపూడ్చివేత పనులు చేపట్టారు. వర్షం లేకపోవడంతో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి 8గంటల వరకూ పూడ్చివేత పనులు జరిపి గండిపూడ్చి వేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ఉమేష్ చంద్ర విగ్రహానికి నివాళి అర్పిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐలు రమేష్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు

పోలీసు వ్యవస్థకు వన్నె తెచ్చిన ఉమేష్‌చంద్ర

● తెనాలి డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 4: పోలీసు వ్యవస్థకు దివంగత ఐపీఎస్ చదలవాడ ఉమేష్‌చంద్ర వన్నె తెచ్చారని తెనాలి డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. బుధవారం దివంగత ఐపీఎస్ చదలవాడ ఉమేష్‌చంద్ర వర్ధంతిని పురస్కరించుకొని చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహానికి పోలీసు అధికారులతో కలసి డీఎస్పీ జనార్ధనరావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణకు, శాంతి భద్రతల పరిరక్షణకు అహర్నిశలు అంకిత భావంతో పనిచేసిన వ్యక్తి ఉమేష్ చంద్ర అన్నారు. సమాజంలో పోలీసులు అంటే ప్రజల రక్షకులని, సంఘవిద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపుతూ శాంతి భద్రతల పరిరక్షణకు చివరివరకు పోరాడిన యోధుడని, పోలీసు వ్యవస్థలో చిరస్మరణీయంగా నిలిచిపోయారని అన్నారు. కార్యక్రమంలో పట్టన సీఐలు బెల్లం శ్రీనివాసరావు, రమేష్‌బాబు, పట్టణ పోలీసులు, కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



బుర్రిపాలెంలో ఎస్టీకాలనీ ప్రజల యోగక్షేమాలు విచారిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ముంపు తగ్గిన తరువాత ఇళ్లకు పంపుతాం

● తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, సెప్టెంబరు 4: పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలను వారి ఇళ్లకు ఉన్న వరదముంపు తగ్గిన వెంటనే తిరిగి సురక్షితంగా పంపిస్తామని తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. బుధవారం మండలంలోని బుర్రిపాలెం, అంగలకుదురు గ్రామాల్లో పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడారు. తాగునీరు ఆహారం సకాలంలో అందుతున్నాయా అని వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. అంతా బాగానే ఉన్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అంగలకుదురులోని పునరావాస కేంద్రానికి గ్రామ ఉపసర్పంచ్ కనగాలనాగభూషణంతో కలిసి పరిశీలించారు. ఆశ్రయం పొందుతున్న వారికి అందించే ఆహారాన్ని పరిశీలించారు. వరద ముంపు తగ్గేవరకూ ఎట్టిపరిస్థితుల్లో ఇక్కడ నుంచి బయటకు వెళ్లవద్దన్నారు. ఉపసర్పంచ్ నాగభూషణం మాట్లాడుతూ పునరావాసకేంద్రంలో ఆశ్రయం పొందుతున్న గ్రామస్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా తాను పర్యవేక్షిస్తానని అధైర్యపడవద్దన్నారు. పలువురు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వరద బాధితులకు అందజేసేందుకు జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ విజయమ్మకు మందులు అందజేస్తున్న రోటరీ సభ్యులు

వరద బాధితులకు మందుల పంపిణీ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 4: వరద బాధితులలో అనారోగ్య సమస్యల బారిన పడినవారికి అవసరమైన మందులను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందజేశారు. బుధవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామాలలోని వరద బాధితులలో ఆనారోగ్య సమస్యలతో ఉన్న వారికి రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ విజయలక్ష్మికి రూ.25,000 విలువచేసే మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జీవనలత, క్లబ్ కార్యదర్శి డి.మురళీకృష్ణ, ఈదర వెంకటపూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరావు, డాక్టర్ రామలక్ష్మి, మోటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవకులమని చంద్రబాబు నిరూపించారు

● టీడీపీ నేత వీరవల్లి మురళి

తెనాలి రూరల్, సెప్టెంబరు 4: పాలకులం కాదు మేము సేవకులమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరూపించారని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విపత్తు వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు స్పందించిన తీరు వైసీపీకి చెంపపెట్టు అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో భారీ వర్షాలు కురిసి పంటలు నీటమునిగి రైతులు పుట్టెడు దుఖంలో ఉంటే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కనీసం వారిని పరామర్శించి ధైర్యం చెప్పిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఐదేళ్లలో వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నా.. డ్రెయిన్లు పూడిపోయి గడ్డిజాతి మొక్కలతో నిండుకున్నా కనీసం వాటి మరమ్మతులు కూడా చేపట్టలేదని అన్నారు. పాలన చేతగాని అసమర్ధపు ప్రభుత్వం వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డిదని దుయ్యబట్టారు. అప్పటి నిర్లక్షధోరణి ఫలితంగానే నేడు డ్రెయిను కట్టలు తెగడం, పొంగిపొర్లడం రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. వరద సహాయక చర్యల్లో సామాన్యుడిలా పాల్గొని ఎక్కడా కూడా ప్రాణనష్టం జరగకుండా బాధ్యతగల ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలన ఉందన్నారు. ప్రజలందరూ చంద్రబాబు పాలనను అభినందిస్తుంటే చూసి జీర్ణించుకోలేక ఏదోరకంగా ఆయనపై బురద జల్లే ప్రయత్నం వైసీపీ చేస్తుందే తప్ప వరద ముంపులో ఉన్న ప్రజలకు సాయం అందిద్దామన్న భావన ఇప్పటికీ రాకపోవడం శోచనీయమన్నారు. ఇకనైనా చంద్రబాబును విమర్శించడం మానుకోకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారని మురళి హితవు పలికారు.

కులగణనకు ఆర్ఎస్ఎస్ మద్దతుపై హర్షం

● రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షుడు శంకరరావు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 4: దేశవ్యాప్త కులగణనకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మద్దతు ఇవ్వడాన్ని రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షుడు కేసన శంకరరావు హర్షం తెలిపారు. బుధవారం తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ, కేరళలో జరిగిన ఆర్ఎస్ఎస్ జాతీయ సమన్వయ సమావేశాల్లో దేశవ్యాప్తంగా కులగణనను సమగ్రంగా చేయడానికి మద్దతు ఇచ్చిందన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అవసరమైన పథకాలను రూపొందించేందుకు రిజర్వేషన్లను అమలు చేసేందుకు కులగణన ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఆర్ఎస్ఎస్ నేతలు కులగణన వ్యతిరేకించారని చెప్పారు. తాజాగా జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో కులగణనకు ఆమోదం తెలపడం బీసీ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. మండల్ కమిషన్ సిఫారసులమేరకు ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించినప్పటికీ పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదని చెప్పారు. సబ్‌ప్లాన్ ఏర్పాటుచేసి బడ్జెట్ కేటాయింపులు జరపాలని, చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని, క్రిమిలేయర్ విధానం రద్దు చేయాలని, మహిళా రిజర్వేషన్ చట్టం సవరించాలని బీసీ సంఘం డిమాండ్ చేస్తుందన్నారు.

టీడీపీ నేత హరిప్రసాద్ మృతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 4: పట్టణంలోని సుల్తానాబాద్‌కు చెందిన టీడీపీ నేత దామర్ల హరిప్రసాద్ (63) బుధవారం మృతి చెందారు. 29వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా, కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్‌గా ఆయన పనిచేశారు. పార్టీ అభివృద్ధి కోసం వార్డులో ఎనలేని కృషి చేశారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ చెప్పారు. పలువురు టీడీపీ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



టీడీపీ నేత హరిప్రసాద్

బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

● కలెక్టర్ నాగలక్ష్మి



పెదకాకాని పునరావస కేంద్రంలో సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

పెదకాకాని, సెప్టెంబరు 4: వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ప్రజాలెవరూ అధైర్యపడవద్దని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పెదకాకాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సందర్శించారు. పునరావాస కేంద్రంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పునరావాస కేంద్రంలో వున్న ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఇబ్బందుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెదకాకానిలోని దర్గా వద్ద వున్న బాజీనగర్, సుందరయ్య కాలనీలలో నివాసం వుంటున్న వరద బాధితులు కట్టుబట్టలతో వున్న 250మందికి ఈ పునరావాసం కల్పించినట్లు ఎంపీడీవో, తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. బాజీనగర్, సుందరయ్య కాలనీలలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యటించి సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాము మూడు రోజుల నుంచి కట్టుబట్టలతో ఉన్నామని, ఇంట్లో వున్న వస్తువులన్నీ పాడైపోయాయని, పాములు, విష కీటకాలు వస్తున్నాయని ప్రజలు జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. ఎన్యూమరేషన్ పూర్తిచేసి రేపు ఉదయానికి నిత్యావసరాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్యూమరేషన్ చేసేటప్పుడు ఆ ఇంటిలో పిల్లలు ఏ తరగతి చదువుతున్నారో తెలుసుకోవాలని, వారికి పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు చేరకుండా ఆయిల్ బాల్స్ వేయాలని పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. పునరావాస కేంద్రంలో రాత్రిపూట పోలీస్ కానిస్టేబుల్ ను నియమించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలన

అనంతరం పెదకాకాని మండలంలో వర్షాలవల్ల దెబ్బతిన్న పంటలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు, జాకీర్ హుస్సేన్ నగర్ వద్ద గుంటూరు చానల్, హై లెవెల్ చానల్, మురుగు డ్రెయిన్ ద్వారా వచ్చిన వరదనీటి ద్వారా మునిగిన పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. పెదకాకాని మండల చివరి పంట భూములు పద కొండు వేల ఎకరాలు వుండగా, వాటిలో తొమ్మిది వేల ఎకరాలలో 40రోజుల పంట నీట మునిగినట్లు రైతులు జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఇక్కడ అధిక సంఖ్యలో కౌలు రైతులు వున్నారని, వీరికి సీసీఆర్సీ కార్డులు కూడా లేవని, ఒకొక్కరు ఎకరానికి పదిహేను నుంచి 20వేల రూపాయల వరకు నష్టపోయారన్నారు. ఎకరానికి ఆరు కట్టల చొప్పున చల్లడానికి పొలం గట్ల మీద ఎరువులు వుంచగా అవి వర్షానికి అవి కూడా పాడైపోయాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు అవని అడంగల్, వన్‌బీలో ఎక్కని రైతులకు కూడా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హఫ్‌పేట మురుగు డ్రెయిన్ ద్వారా పంట పొలాలు మునిగిపోకుండా డ్రెయిన్‌కు మరమ్మతులు చేపట్టి, పూడికతీసి బాగుచేయాలని రైతులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను కోరడం జరిగింది. ఈ సందర్భంగా పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బూసి బాబు, వలివేటి మురళి కృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

● మండపాలకు తరలివెళుతున్న విగ్రహాలు

● మండపాలు, విద్యుత్ లైట్ల ఏర్పాట్లలో కమిటీలు బిజీ



మండపాలకు తరలివెళుతున్న వినాయక మట్టి విగ్రహాలు, తెనాలిలో చవితి ఉత్సవాలకు ఏర్పాటు చేస్తున్న మండపం

తెనాలి రూరల్, సెప్టెంబరు 4: చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు భక్తజనులు సిద్ధమవుతున్నారు. అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వర్షపునీరు మండపాల్లోకి చేరకుండా ముందస్తుగానే తగు జాగ్రత్తలతో మండపాలు సిద్ధం చేస్తున్నారు. తెనాలిలో మండపాలు రూ.లక్షలు వెచ్చించి సుందరంగా ముస్తాబుచేయడంతో పాటు అందులో పూజలందుకునే గణనాథులను సైతం హైదరాబాద్ వంటి మహానగరాల నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి ఇక్కడ తీసుకువచ్చి ఉత్సవాలు కనుల పండుగగా నిర్వహిస్తుంటారు. ఇక పరిసర ప్రాంతాల్లో కూడా సంప్రదాయబద్ధంగా మండపాలు ముస్తాబుచేసి దారిపొడవునా విద్యుత్‌లైట్లను ఏర్పాటుచేసి ఘనంగా పూజాది కార్యక్రమాలు జరుపుతారు. మరో రెండు రోజుల్లో చవితి పూజలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా ఉత్సవ కమిటీలు వైభవంగా నిర్వహించేందుకు పనుల్లో హడావిడిగా ఉన్నారు. కమిటీలో కొందరు మండపాల పనులు చూస్తుండగా మరి కొందరు తయారీకేంద్రాల నుంచి మండపాలకు విగ్రహాలను తరలించేపనిలో నిమగ్నమయ్యారు. తెనాలి చెంచుపేట, అంగలకుదురు గణేష్‌యూత్ ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో మట్టి వినాయక ప్రతిమలు పలు ఆకారాల్లో రూపుదిద్దుకుని అమ్మకాలకు సిద్ధమయ్యాయి. బుక్ చేసుకున్న వారు ఆయా గ్రామాలకు విగ్రహాలను ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్నారు. తయారీ కేంద్రాల వద్ద వివిధ గ్రామాల కమిటీ సభ్యులు విగ్రహాలను తిలకించి కొనుగోలు చేసేందుకు వచ్చేవారితో పాటు విగ్రహాలను తరలించుకెళ్లే కమిటీ సభ్యులతో కోలాహలంగా మారింది. గత ఏడాది కంటె ఈ సంవత్సరం ఉత్సవాలను మరింత వైభోపేతంగా నిర్వహించేందుకు కమిటీలు పోటీపడుతున్నాయి.

ఉత్సవాల్లో నిబంధలను పాటించండి: త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 4: వినాయక చవితి ఉత్సవాల నిర్వాహక కమిటీ సభ్యులు నిబంధలను పాటించాలని త్రీటౌన్ సీఐ రమేష్ బాబు అన్నారు. బుధవారం త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు మండపాలు ఏర్పాటు చేయు సమయంలో ప్రభుత్వం నియమనిబంధలను పాటించాలన్నారు. మండపాలు ఏర్పాటు చేసేటప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని, లైటింగ్, డెకరేషన్ పనులను చేసే సమయంలో ఫైర్‌సేఫ్టీ నిబంధలను పాటించాలని సూచించారు. ఉత్సవాల ముగింపు వరకు ప్రైవేటు పాటలను, అసభ్యకరమైన నృత్యాలను, కులమత రాజకీయాలను రెచ్చగొట్టే డీజేలను ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. మండపంలో వినాయక చవితి ఉత్సవాల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉత్సవ కమిటీ వారిదే బాధ్యతన్నారు. పోలీసువారి సూచలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.



వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్ సతీమణి మనోహరం, సబ్‌కలెక్టర్ సంజనాసింహ

వరద బాధితులకు అండగా ఉంటాం: మనోహరం

కొల్లిపర, సెప్టెంబరు 4: వరద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, అధైర్యపడవద్దు అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సతీమణి మనోహరం అన్నారు. బుధవారం మండల పరిధిలోని తూములూరు హైస్కూల్‌లో, హనుమాన్‌పాలెం స్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లోని కొత్తూరులంక, అన్నవరంలంక, బొమ్మువానిపాలెం వరద బాధితులను సబ్‌కలెక్టర్ సంజనాసిన్హతో కలిసి పరామర్శించారు. అనంతరం సబ్‌కలెక్టర్ సంజనాసింహతో కలిసి మనోహరం వరద బాధితులకు ప్రభుత్వం అందజేసిన నిత్యావసరాలను, దుస్తులను, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, సీఎస్ డీటీ మూర్తి, నాయకులు అడపా నారాయణరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, ఎన్టీఆర్ కోటిరెడ్డి, దివ్వెల వెంకయ్యానాయుడు, దివ్వెల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను వేగవంతం చేయండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 4: పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను వేగవంతం చేయండని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 37వ వార్డులో జరగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో పట్టణంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని అన్నారు. పట్టణంలో గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని కాచి చల్లార్చిన నీరు తాగాలని, తాజా ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. వ్యర్థాలను డ్రెయిన్‌లలో, మురుగు కాలువలలో వేయరాదని కోరారు. అనంతరం పలు వార్డులలో జరగుతున్న శానిటేషన్ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచలను చేశారు.

తమలపాకు సాగులో సస్యరక్షణ చర్యలు



తమలపాకు తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 4: తమలపాకు సాగులో సస్యరక్షణ పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి వి.రవీంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని ములుకుదురు, చింతలపూడి గ్రామాల్లో బుధవారం ఉద్యాన పంటలను అధికారులు పరిశీలించారు. అధిక వర్షాలకు తమలపాకు తోటల్లో తేమశాతం పెరిగిందన్నారు. వంగిపోయిన అవిశ మొక్కలను లేపి పాదుల్లోకి మట్టిని ఎగదోయాలన్నారు. ముదురు తోటల్లో తెగిన తీగలను తుంచి ఒక శాతం బోర్డో మిశ్రమం పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యానశాఖ అధికారి ఉషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం



అవయవదానం చేసిన వెంకట్రావు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 4: పట్టణానికి చెందిన కర్పూరపు వెంకట్రావు అవయవదానం చేశారు. 59 ఏళ్ల వయసులో ఆయన మంగళవారం మృతి చెందారు. ఆయన అమ్మ ఐ ఆర్గాన్ అండ్ బాడీ డోనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సంస్థకు ప్రమాణ పత్రం ఇచ్చారు. ఈ మేరకు ఆయన కుమార్తె మేఘన శివాని ఆయన భౌతికకాయాన్ని మంగళగిరి ఎన్నారై కళాశాలకు అప్పగించారు. సంస్థ కో-ఆర్డినేటర్ నండూరి నారాయణరావు వెంకట్రావు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెమ్మసాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్‌క్యాన్‌లు పంపిణీ



అన్నవరంలంకలో వాటర్‌క్యాన్‌లను పంపిణీ చేస్తున్న పెమ్మసాని ఫౌండేషన్ సభ్యులు, టీడీపీ నాయకులు

కొల్లిపర, సెప్టెంబరు 4: కృష్ణానది వరద ముంపు ప్రాంతాలైన మండల పరిధిలోని అన్నవరంలంక, కొత్తూరులంక, బొమ్మువానిపాలెం గ్రామాల్లో పెమ్మసాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బుధవారం వాటర్‌క్యాన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవటం మానవ ధర్మమన్నారు. పెమ్మసాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వాటర్‌క్యాన్‌లను పంపిణీ చేయడం జరిగిందని వారందరికీ వరద ఉన్నంతవరకు ప్రతిరోజు నీటి క్యాన్‌లను ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు కోటిరెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, మాజీ సర్పంచ్ బొల్లు యోగానందచటర్జీ, పాలడుగు జోగేంద్ర, తాతా అంజనేయులు, పెమ్మసాని రంగస్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

పెదకాకాని, సెప్టెంబరు 4: వరద బాధితుల సహాయార్థం ఏఎన్‌యూలో డీఈఈగా విధులు నిర్వహి స్తున్న ఎస్ వెంకటేశ్వరరావు రూ.10,116లను ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయాలని కోరుతూ బుధవారం ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును వీసీ గంగాధరరావు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెక్టార్ కె.రత్న షీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి, సూపరింటెండెంట్ భానుప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సాయం

కొల్లిపర, సెప్టెంబరు 4: అన్నవరంలంకలో 350మంది వరద బాధిత కుటుంబాలకు బుధవారం అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో లక్ష రూపాయలు విలువగల నిత్యావసరాలను అందచేశారు. డీత్రీ శారద సర్వీస్ సొసైటీ తరుపున వరద బాధితులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ డిప్యూటీ సీఈవో జె.మోహన్‌రావు సేవలందిస్తున్న వారిని ప్రశంసించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో విజయలక్ష్మి, పరిపాలనాధికారి చంద్రమోహన్, అన్నదాత సుఖీభవ సభ్యులు కుర్రా శ్రీనివాసరావు, నారాయణ, రాజేశ్వరి, శిరీష పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 4: రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు పణిదపు వెంకటకృష్ణ, రావి చినవెంకటేశ్వర్లు, ఉయ్యూరు పద్మావతి, పి.లలిత, వెలగా సుభాష్‌చంద్రబోస్, బత్తుల వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, బెల్లంకొండ వెంకట్‌లను సన్మానించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు.



డీవీసీ కాలనీలో నీటిని తోడుతున్న ఇంజన్లు

ముంపు నుంచి బయటపడుతున్న డీవీసీ కాలనీ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 4: భారీ వర్షాలతో ముంపునకు గురైన డీవీసీ కాలనీలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. బుధవారం కాలనీలో గృహాలన్నీ నీటిముంపు నుంచి బయటపడ్డాయి. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు పురపాలక సంఘం అధికారులు రాత్రింబవళ్లు ఇంజన్ల ద్వారా కాలనీలోని నీటిని టీబీ డ్రెయిన్లలోకి మళ్లిస్తున్నారు. రెండు రోజుల నుంచి అధికారులు చేస్తున్న ప్రయత్నాలతో బుధవారం నీరుచేరిన గృహాలన్నీ నీటి నుంచి బయటపడ్డాయి. పారిశుధ్య కార్మికులు వీధులు శుభ్రం చేయటంతోపాటు బ్లీచింగ్ చల్లుతున్నారు. అంతే కాకుండా వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు.

1200 మందికి ఆహారం పంపిణీ



వరద బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న మహిళలు, చిన్నారులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 4: విజయవాడలో వరద ముంపునకు గురై సర్వం కోల్పోయిన కుటుంబాలకు ఆహారం అందించేందుకు పట్టణంలోని మహిళలు, చిన్నారులు ముందుకువచ్చారు. పట్టణంలోని జీబీసీ రోడ్డులో ఉన్న వృషబాద్రి టవర్స్‌కు చెందిన మహిళలు, చిన్నారులు కలిసి 1200మందికి ఆహారం తయారుచేసి ప్యాకింగ్ చేసి ఆటో ద్వారా విజయవాడ తీసుకెళ్లి అక్కడి అధికారులకు అందజేశారు.

ఇల్లు కోల్పోయిన విద్యార్థికి ఆర్థికసాయం



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్‌వీ ఐటీ కళాశాల నిర్వాహకులు

చేబ్రోలు, సెప్టెంబరు 4: ఇటీవల సంభవించిన వరదల్లో ఇల్లు కోల్పోయిన విద్యార్థికి ఆర్‌వీఐటీ కళాశాల ఆర్థికసాయం అందించింది. నాగాయలంకలో నివసిస్తున్న కళాశాలకు చెందిన డిప్లమో ప్రథమ సంవత్సరం విద్యార్థి రోహిత్ ఇల్లు దెబ్బతింది. ఈ సమాచారం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణయ్య రూ.12 వేల ఆర్థికసాయాన్ని బుధవారం రోహిత్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శ్రీధర్, సీఎస్‌ఈ విభాగం అధిపతి వి.దినేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి: ఏడీఏ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 4: పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలోని రైతులు తప్పనిసరిగా ఈ-పంట యాప్‌లో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఏడీఏ వి.రామకోటేశ్వరి బుధవారం తెలిపారు. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో 37,194 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి పంట సాగు చేశారన్నారు. నెల రోజుల నుంచి వ్యవసాయశాఖ సిబ్బంది ఈ పంటలో పంట నమోదు కార్యక్రమాన్ని చేపడుతునట్లు చెప్పారు. ఇప్పటివరకు 31,487 ఎకరాల్లో రైతులు ఈకేవైసీ నమోదు చేసుకునట్లు చెప్పారు. మిగిలిన రైతులు కూడా ఆధార్‌తో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న రైతులే ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులన్నారు. మరో రెండు రోజుల్లో రైతు సేవాకేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి పంట నమోదు వివరాలను నమోదు చేసుకోవలసిందిగా ఏడీఏ రామకోటేశ్వరి సూచించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 4: గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం జరిగింది. ఐపీఎస్ ఉమేష చంద్ర 25వ వర్ధంతి సందర్భంగా ఆయన తల్లితండ్రులు వేణుగోపాలరావు, నయనతార, కుటుంబ సభ్యుల సహకారంతో పండ్లను పంపిణీచేసి, అన్నదానం చేశారు.

SBI స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆర్ఏసీపీసీ, డోర్ నెం.26-1-52, కన్నావారితోట, గుంటూరు-522004. ఫోన్ : 0863-2337730, మెయిల్ ఐడి : sbi.05256@sbi.co.in

స్వాధీనపత్ర ప్రకటన రూల్ 8(1) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 8 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు : **1) శ్రీమతి ముండ్లపాటి లక్ష్మి, భర్త : సుదర్శనబాబు,** ఫ్లాట్ నెం.201, శ్రీనిలయం, సమీప డోర్ నెం.3-151, శాంతి ఆర్ట్స్ రోడ్డు పక్కన, రెడ్డిపాలెం, గుంటూరు-522509 మరియు **2) శ్రీ ముండ్లపాటి సుదర్శన బాబు, తండ్రి : వెంకట సుబ్బయ్య,** ఫ్లాట్ నెం.201, శ్రీనిలయం, సమీప డోర్ నెం.3-151, శాంతి ఆర్ట్స్ రోడ్డు పక్కన, రెడ్డిపాలెం, గుంటూరు-522509 వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయిసొమ్ము **తేది.29.06.2024 నాటికి రూ.33,00,685/- (అక్షరాల ముప్పై మూడు లక్షల ఆరు వందల ఎనభై ఐదు రూపాయలు మాత్రమే)** మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.29.06.2024 న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.**

ఋణగ్రహీతలు/చట్టబద్ధమైన వారసులు/ హామీదారులు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు, హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్ (4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 & 9 ప్రకారము **ది.31-08-2024 న** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకువారికి చెల్లించవలసిన బకాయిసొమ్ము **తేది.29.06.2024 నాటికి రూ.33,00,685/- (అక్షరాల ముప్పై మూడు లక్షల ఆరు వందల ఎనభై ఐదు రూపాయలు మాత్రమే) (డిమాండ్ నోటీసు తరువాత చెల్లించిన బకాయి తగ్గించబడును)** మరియు తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు మొ॥నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి** ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు /చట్టబద్ధమైన వారసులు/ హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది.

సదరు చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తనఖావుంచబడిన స్థిరాస్తి వివరములు

శ్రీమతి ముండ్లపాటి లక్ష్మి, భర్త: సుదర్శనబాబుకు చెందిన ఆస్తి.

షెడ్యూలు ఎ : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, రెడ్డిపాలెం గ్రామ పంచాయితి ఏరియా, ప్రస్తుతం గుంటూరు కొత్త మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరులోని డి.నెం.377/బి నందు యం.1.53 సెంట్ల విస్తీర్ణముగల భూమి అందులో 895 చ॥గ॥ల విస్తీర్ణముగల స్థలము మరియు అందులో నిర్మించిన **"శ్రీ నిలయం"** పేరునగల అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు** : (సమీప డోర్ నెం.3-151) : **తూర్పు** : గుత్తా మహేష్‌బాబు గారికి చెందిన ఆస్తి - 71'5", **దక్షిణం : 30 అ॥ల** వెడల్పుగల రోడ్డు - 113'6", **పడమర** : పప్పుల వెంకటరెడ్డి గారికి చెందిన ఆస్తి - 70'5", **ఉత్తరం** : పి. నరసింహారెడ్డి, పప్పుల వెంకట నరసింహారెడ్డి వగైరాలకు చెందిన ఆస్తి - 113'6". ఈ హద్దుల మధ్యగల 895 చ॥గ॥లు లేదా 748.33 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థలముతోగల ఆస్తి దీనిలో

షెడ్యూలు బి : (ది.02-01-2021 నాటి రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.66/2021 ప్రకారం) పైన తెలిపిన షెడ్యూలు-ఎ ఆస్తిలోని 44.75 చ॥గ॥లు లేదా 37.41 చ॥మీ॥ల అవిభాజిత అనిర్దేశిత వాటాతోగల స్థలము నందలి **"శ్రీ నిలయం"** 1వ అంతస్తు లోని 1165 చ॥అ॥ల ప్లింత్ ఏరియా విస్తీర్ణం (కామన్ & కారు పార్కింగ్ ఏరియాతో కలిపి) పైన పేర్కొనబడిన స్థలము భాగముగల స్టిల్ట్ ఫ్లోర్ నందు ఒక కారు పార్కింగ్, అన్ని ఉమ్మడి మరియు అనుభుక్తపు హక్కులతో పాటు అన్ని ఉపకరణములు గల ఒక ఫ్లాట్ నెం.201 కు **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** కామన్ కారిడార్ మరియు లిఫ్ట్, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

ప్రదేశం : గుంటూరు, తేది : 31-08-2024 సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఏసీపీసీ, గుంటూరు.